నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
ఆదివారం | ఏప్రిల్ 28, 2024 | www.navatelangana.com

జొన్నలను కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి

నవతెలంగాణ-పిట్లం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏఈవో

జొన్నలను ప్రభుత్వ కొనుగోలు సెంటర్లలోనే విక్రయించి లబ్ధిపొందాలని తిమ్మా నగర్ క్లస్టర్ వ్యవసాయ విస్తీర్ణ అధికారి ప్రదీప్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని తిమ్మా నగర్ సింగిల్ విండో ఆధ్వర్యంలో జొన్నల కొనుగోలు సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రబ్బీ సీజన్‌గాను రైతులు పండించిన జొన్న పంటను దళారులకు విక్రయించి మోసపోవద్దన్నారు. ప్రభుత్వం జొన్న పంట ఒక క్వింటాలుకు రూ.3180 ప్రకటించిందన్నారు. రైతులు పట్టాపాస్ పుస్తకము, ఆధార్, బ్యాంకు అకౌంట్‌బుక్‌ల జిరాక్స్ పత్రంలను కొనుగోలు సెంటర్ అధికారులకు అందజేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో విండో సీఈవో అశోక్ గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలకు ఫీజు గడువు మే 2

నవతెలంగాణ-మద్నూర్/రామారెడ్డి

ఇంటర్ పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులకు సంప్లమెంటరీ పరీక్షలు నిర్వహించేందుకు ఫీజు చెల్లించేందుకు మే 2వ తేదీ వరకు గడువు ఉన్నట్టు మద్నూర్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫెయిల్ అయిన విద్యార్థులు మళ్లీ పరీక్షలు రాసేందుకు ఎలాంటి అపరాద రుసుము లేకుండా మే 2 తేదీ వరకు ఫీజు చెల్లించవచ్చని తెలిపారు.

రామారెడ్డి : ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో ఫెయిల్ అయిన విద్యార్థులకు సప్లమెంటరీ పరీక్షలకు మే 2వ తేదీ ఫీజు చెల్లించడానికి చివరి తేదీ అని, రామారెడ్డి కళాశాల ప్రిన్సిపాల్ మధు శ్రీవాత్సవ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఈ సందర్భంగా విద్యార్థులకు సూచించారు.

జోరందుకున్న ప్రచారం

- ప్రచారంలో స్పీడ్ పెంచిన అభ్యర్థులు
- ఉదయం, సాయంత్రం వేళల్లో రోడ్‌షోలు, సభలతో ప్రచారం
- గెలుపే లక్ష్యంగా హామీల వర్షం



సభలో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి (ఫైల్)



ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పోచారం



నవతెలంగాణ-లింగంపేట్

నామినేషన్‌ల ఘట్టం పూర్తవడంతో అభ్యర్థులు ప్రచారంపై ఫోకస్ పెంచారు. ఇన్ని రోజులుగా నియోజకవర్గాలు, మండలాల వారీగా కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించిన అభ్యర్థులు.. ప్రస్తుతం నేరుగా ప్రజల్లోకి వెళ్తున్నారు. వేసవి ఎండలు ముదరడంతో ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రచారాలు చేపడుతున్నారు. ముఖ్యంగా రోడ్‌షోలు, కార్నర్ మీటింగ్‌ల పేరుతో ప్రజలకు చేరవయ్యేందుకు ప్రయత్నం చేస్తున్నారు.

జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో ప్రధాన పార్టీలైన కాంగ్రెస్ నుంచి సురేశ్ షెట్కార్, బీఆర్ఎస్ నుంచి గాలి అనిల్‌కుమార్, బీజేపీ నుంచి బీబీ పాటిల్ బరిలో నిలిచిన విషయం విధితమే. కాగా నామినేషన్‌ల ఘట్టం పూర్తవడంతో అభ్యర్థులు ప్రచారంపై దృష్టిసారించారు. ఇటీవల వరకు సమావేశాలకే పరిమితం కాగా.. ప్రస్తుతం నేరుగా కదనరంగంలోకి దూకారు.

కామారెడ్డి జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో ఆయాపార్టీల ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు, అభ్యర్థులు కలివిడిగా తిరుగుతూ ప్రచారం చేపడుతున్నారు. కాంగ్రెస్ తరపున ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు, లక్ష్మీకాంత్‌రావు, ఇన్‌చార్జి ఏనుగు రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కామారెడ్డి, ఎల్లారెడ్డి, జుక్కల్, బాన్సువాడ నియోజకవర్గాల్లో ప్రచారం స్పీడ్ పెంచారు. జహీరాబాద్ లోక్‌సభ పరిధిలో శంకరంపేట్‌లో శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించిన సభకు ఇక్కడి నుంచి జనసమీకరణ చేపట్టారు. ఈ నేపథ్యంలో సీఎం సభతో కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్ నెలకొంది. మండల కేంద్రంలో బైక్ ర్యాలీలు, రోడ్ షోలు గ్రామాల్లో బైక్ ర్యాలీలు ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ ప్రచారంలో ముందున్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో జహీరాబాద్ నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన మదన్ మోహన్‌రావు 6000 స్వల్ప ఓట్ల తేడాతో బిబి పాటేల్‌పై ఓడిపోయారు. ఈ నేపథ్యంలో ఈసారి ఎలాగైనా సీటు కైవసం చేసుకోవాలని ఆ పార్టీ భావిస్తుంది.

మరోవైపు బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గాలి అనిల్ కుమార్ తరఫున మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి నాలుగు నియోజకవర్గాల్లో తిరుగుతూ ప్రచారం చేపడుతున్నారు. ఏడు పదుల వయస్సులో సైతం రోడ్‌షోలు, బహిరంగ సభలు నిర్వహిస్తూ.. బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా ప్రచారం చేపడుతున్నారు. గత మూడు రోజుల క్రితం కార్యకర్తల్లో ఉత్సాహం నింపేందుకు నాగిరెడ్డిపేట్ మండలం లింగంపేట మండల కేంద్రాల్లో మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ మాజీ ఎమ్మెల్యే జనార్దన్ గౌడ్ రోడ్ షో, బైక్ ర్యాలీలు చేపట్టారు.

భారతీయ జనతా పార్టీ మండల కేంద్రాల్లో బూత్ స్థాయి సమావేశాలు నిర్వహించి కార్యకర్తలను ఉత్తేజపరుస్తుంది. అయినప్పటికీ గ్రామాల్లో ప్రచారం ఇంటింటా ప్రచారం నామమాత్రంగా కొనసాగు తుంది. ఇటీవల భారతీయ జనతా పార్టీ కామారెడ్డి శాసనసభ్యులు రమణారెడ్డి లింగంపేట్ ఎల్లారెడ్డి మండల కేంద్రంలో బూత్ స్థాయి కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసి ప్రచారాన్ని వేగవంతంగా చేపట్టాలని ఆదేశించారు. అయినా ఫలితం లేకుండా పోతుంది క్షేత్రస్థాయిలో మాత్రం ఇంటింట ప్రచారంలో వెనుకంజలో ఉన్నారు.

ప్రచారంలో భానుడి ప్రతాపం..

ప్రచారంలో భానుడు తన ప్రతాపం చూపిస్తున్నాడు. ఉష్ణోగ్రతలు 44 డిగ్రీలు దాటుతుండటంతో ప్రచారంలో పాల్గొనేం దుకు ప్రజలు జంకుతున్నారు. దీంతో నాయకులు సైతం ఉదయం, సాయంత్రం వేళల్లో పెద్దఎత్తున జనసమీకరణ చేపట్టి ప్రచారం చేపడుతున్నారు. సాయంత్రం ఐదు గంటల నుంచి రాత్రి వరకు బైక్ ర్యాలీలు, రోడ్ షోలు నిర్వహిస్తున్నారు. ఉదయం వేళల్లో ఇంటింటి ప్రచారంతో పాటు ఉపాధి పని ప్రదేశంలో తిరుగుతూ ప్రచారం చేపడుతున్నారు.



మూడు పార్టీలు ముమ్మర ప్రచారాలు

- 30న మోడీ రాక.. తదనంతరం కేసీఆర్ ప్రచారం
- ఇది వరకే రేవంత్‌సభ ముగింపు

నవతెలంగాణ-మద్నూర్

తెలంగాణలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల సమయం రోజుకు దగ్గర పడుతుండడంతో మూడు పార్టీలు కాంగ్రెస్, బిజెపి, బీఆర్ఎస్ తమ ప్రచారాలను ముమ్మరం చేశాయి. అభ్యర్థుల గెలుపు కోసం ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు ఇంటింటా ప్రచారాలు ముమ్మరం చేశారు. ఇలాంటి ప్రచారాలే కాకుండా ప్రతి గ్రామంలో గల్లిగల్లిలో రథ ప్రచారాలు సౌండ్‌లతో గడగడలాడిస్తున్నాయి. అభ్యర్థుల గెలుపు కోసం పార్టీల ముఖ్య నాయకులు సభలకు హాజరవుతున్నారు. జహీరాబాద్ పార్లమెంట్ సీటును కైలాసం చేసుకునేందుకు మూడు పార్టీల ముఖ్య నాయకులు సభలకు హాజరవుతున్నారు. బిజెపి పార్టీ అభ్యర్థి బీబీ పాటిల్ గెలుపు కోసం ఈనెల 30న దేశ ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రచార సభకు హాజరు కానున్నారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సురేష్ షెట్కార్ గెలుపు కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 26న శుక్రవారం జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో ప్రచార సభకు హాజరై, ఆ పార్టీ అభ్యర్థి కోసం ప్రజలకు పథకాల గురించి తెలియజేశారు. బిఆర్ఎస్‌పార్టీ జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా గాలి అనిల్‌కుమార్ పోటీ చేస్తున్నారు. ఆయన గెలుపు కోసం బస్సు యాత్ర ద్వారా రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి బీఆర్ఎస్ అధినేత కెసిఆర్ జహీరాబాద్ ప్రాంతానికి రానున్నారు. ఇలా రోజురోజుకు ఎన్నికల సమయం దగ్గర పడుతుండడంతో పార్టీల ప్రచారాలు జోరందుకున్నాయి. ఓట్ల కోసం అభ్యర్థుల గెలుపు కోసం ఆయా పార్టీలు పాట్లు పడుతున్నాయి. ఇంటింట ప్రచారాలే కాకుండా ప్రతి గ్రామంలో ఉపాధి పనులు చేసే కూలీల వద్దకు పార్టీల నాయకులు, కార్యకర్తలు వెళ్లి అభ్యర్థుల గెలుపు కోసం ఓట్లు వేయాలని కోరుతున్నారు. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ ఎన్నికలు అభ్యర్థుల ప్రచారాలను చూస్తుంటే గెలుపు ఎవరిది అనేది అంచనాలు వేయలేని పరిస్థితి నేనంటే నేనే గెలుస్తానంటూ పార్టీల అభ్యర్థులు నాయకులు ధీమా వ్యక్తం చేసుకుంటున్నారు. గెలుపు కోసం మూడు పార్టీల నాయకులు పిలువగానే శుభకార్యక్రమాలు పాల్గొంటున్నారు. ప్రచారాలకు కసరత్తులు ముమ్మరం అయ్యాయి జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపు కోసం మూడు పార్టీలు ముమ్మర ప్రచారాలు చేపడుతున్నాయి.

ఒకరి బదులు మరొకరు..

- ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షల్లో లీలలు

నవతెలంగాణ-కామారెడ్డి



పరీక్ష రాస్తున్న విద్యార్థులు (ఫైల్)

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు గురువారం నుంచి ప్రారంభమైయ్యాయి. అయితే కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఒకరి బదులు మరొకరు పరీక్ష రాసినట్టు విశ్వసనీయ సమాచారం. అధికారుల కనుసన్నల్లోనే జరిగిందా లేదా.. వారి పట్టింపులేని తనంతో జరిగిందా అన్న చర్చలు కొనసాగుతున్నాయి. ఇందుకోసం పెద్దఎత్తున ముడుపులు చేతులు మారుతున్నట్టు విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు.

కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా శుక్రవారం జరిగిన ఓపెన్ 10వ, తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలకు 220 మంది విద్యార్థులు గైరాజర య్యారని జిల్లా విద్యాశాఖ అధికారి రాజు ఒక ప్రకటనలో తెలిపారు. పదవతరగతి ఓపెన్ పరీక్షలకు 861 మంది అభ్యర్థులు హాజరు కావలసి ఉండగా 748 మంది అభ్యర్థులు హాజరై 113 మంది అభ్యర్థులు గైరాజీర్ అయ్యారన్నారు. ఇంటర్మీడియట్ పరీక్షలకు 1016 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 89 మంది అభ్యర్థులు హాజరై 117 మంది అభ్యర్థులు గైరాజీర్ అయ్యారనీ విద్యాశాఖ అధికారి రాజు ఆ ప్రకటనలో తెలిపారు.

విద్యాశాఖలో అంతా గోప్యమేనా..?

కామారెడ్డి జిల్లా కేంద్రంలో జరుగుతున్న ఓపెన్ టెన్త్ ఇంటర్మీడియట్ పరీక్షలలో భాగంగా శుక్రవారం ఒక అభ్యర్థి పరీక్ష రాయవలసి ఉండగా అతని స్థానంలో మరొక అభ్యర్థి పరీక్ష రాశాడని, అలా జిల్లా కేంద్రంలోని లయోలా పాఠశాలలో అధికారులు ముగ్గురిని పట్టుకొని పరీక్ష హాల్ నుండి బయటకు పంపించారని సమాచారం. ఈ సమాచారాన్ని విద్యాశాఖ అధికారులు ఎందుకు గోప్యంగా ఉంచారో ఇప్పటివరకు ఎవరికీ అర్థం కావడం లేదని పలువురు అసహన వ్యక్తం చేస్తున్నారు. మిగిలిన చోట్ల జరుగుతున్న పరీక్ష కేంద్రాలలో ఏం జరుగుతుందో ఎవరికీ అంతు పట్టడం లేదు. జిల్లా కేంద్రంలో పలు పాఠశాలలలో విద్యా హక్కు చట్టానికి వ్యతిరేకంగా నడుస్తున్నా వాటిని పట్టించు కోవడంలేదని విమర్శలు ఉన్నప్పటికీ విద్యాశాఖ అధికారులు మార్పు రాకపోవడంపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

మతోన్మాద బీజేపీని ఓడించి ఇండియా కూటమి అభ్యర్థిని గెలిపించండి

- సీఐటీయూ జిల్లా కన్వీనర్ కే.చంద్రశేఖర్

నవతెలంగాణ-కామారెడ్డి



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్

'కార్మిక రంగాలకు బిజెపి పార్టీ అనేక వాగ్దానాలు చేసి పది సంవత్సరాలుగా మోసం చేసింది. బ్రిటిష్ కాలం నుండి పోరాడి సాధించుకున్న 43 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు కోడ్ లను తీసుకొచ్చి కార్మికులను అటు ప్రజలను రైతాంగాన్ని మోసం చేసింది. వీటన్నింటి నుంచి దృష్టి మరల్చేందుకు మతాన్ని ముందుకు తీసుకొస్తుంది. అలాంటి మతోన్మాద బీజేపీని ఓడించి ఇండియా కుటమి బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలని' సీఐటీయూ జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. శనివారం విజ్ఞాన భారతి కాలేజీలో పార్లమెంట్ ఎన్నికల్లో కార్మికులు కార్మిక రంగాల పాత్ర కార్మిక రంగాల కర్తవ్యంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఢిల్లీలో రైతులు ఏడాదిన్నర పాటు రైతు వ్యతిరేక చట్టాలు రద్దు చేయాలని పోరాటం చేస్తే బీజేపీ ప్రభుత్వం.. వారిపై లాఠీచార్జ్ నిర్బంధాలు కేసులు పెట్టి ఉద్యమాన్ని అణచివేయాలని అనేక కుట్రలు చేసింది. ఈ ఉద్యమంలో 600 మంది రైతులు చనిపోయినారు. ఒక పక్క కరోనా ప్రజలను ప్రాణాలు తీస్తా ఉంటే దేశవ్యాప్తంగా ప్రజలు ఇంటికే పరిమితమై ఇండ్లలో ఉంటే రైతు వ్యతిరేక చట్టాలను తీసుకొచ్చి రైతుల ప్రాణాలతో చెలగాటమాడింది. కార్మికుల సంక్షేమం కోసం ఉన్న 43 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు కోడ్స్ తీసుకొచ్చి ఈరోజు కార్మికుల జీవితాలతో ఆడుకుంటుంది. బీడీ పరిశ్రమ పైన బీడీ కట్టపైన పుర్రె గుర్తును తీసుకొచ్చి 18 శాతం జిఎస్టి వేసి బీడీ రంగాన్ని నాశనం చేసింది. బిజెపి ప్రభుత్వం ఇప్పటికే అన్ని రంగాల కార్మికులు మున్సిపల్, ఆశ వర్కర్స్, అంగన్‌వాడీ, గ్రామపంచాయతీ, మధ్యాహ్న భోజన వర్కర్, ఐకెపి వర్కర్స్, ఫ్యాక్టరీలు చేసే వర్కర్స్ ఇలా చెప్పుకుంటూ పోతే అనేక రంగాల కార్మికుల సంక్షేమాన్ని విస్మరించింది. కావున ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో కార్మికులందరూ ఆలోచించి ఇండియా కూటమి అభ్యర్థిని గెలిపించాలని సిఐటియు ఆల్ ఇండియా కమిటీ నిర్ణయించింది. దీంట్లో భాగంగా అన్ని రంగాల కార్మికులతో మండల, జిల్లా సదస్సులు గ్రామ సదస్సులు నిర్వహించి ఈ విషయాన్ని కార్మికులకు ప్రజలకు తెలియజేస్తున్నట్టు తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో మతోన్మాద బీజేపీని ఓడించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు వెంకట్ గౌడ్, కే రాజనర్సు, కామారెడ్డి టౌన్ అంగనవాడి యూనియన్ అధ్యక్షురాలు బాబాయ్, ఆశా యూనియన్ సుధా, మున్సిపల్ టౌన్ అధ్యక్షులు ప్రభాకర్, బాల్ నర్సు జిల్లా అధ్యక్షులు, గ్రామ పంచాయతీ, స్కీం వర్కర్లు అసంఘటిత రంగ కార్మికులు హమాలి ఆటో ఇతర రంగ కార్మికులు పాల్గొన్నారు.

మేడేను జయప్రదం చేయండి

- కార్మిక సంఘాల పిలుపు

నవతెలంగాణ-కామారెడ్డి



మాట్లాడుతున్న నాయకులు

కార్మికుల హక్కుల దినోత్సవం మే డే ను జయప్రదం చేయాలని కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో కార్మిక సంఘాల నాయకులు శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి జబ్బర్ నాయక్ మాట్లాడుతూ కార్మికులు, కర్షకులు వెట్టిచాకిరి బానిసత్వం నుండి 12 గంటల పని దినాలను ఎనిమిది గంటల పని దినాలుగా సాధించుకున్న రోజు అని అన్నారు. అలాగే కార్మికులు యజమానులకు బానిసలుగా పని చేస్తూ కార్మికులకు తెలియకుండానే 12 గంటల పనిని యజమాన్యాలు చేయించుకున్నప్పటికీ అప్పుడు జరిగిన పోరాటంలో కార్మికులందరూ ఆ సంఘటిత కార్మికులు ఒకతాటిపై కొచ్చి ఎనిమిది గంటల పని దినాన్ని సాధించుకున్నట్టు ఈ సందర్భంగా గుర్తు చేశారు. కార్మిక, కర్షక మైత్రి కొనసాగి నేడు 8 గంటల పని దినాలు కొనసాగుతున్నాయి అంటే ఆ రోజు కార్మిక సంఘాలతో కార్మికులంతా ఏకమై సాధించుకున్నందుకే అందుకే మేడేను ప్రతి గ్రామ గ్రామాన, మండల, డివిజన్, జిల్లా కేంద్రాల్లో మేడేను జరిపి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా సభ్యులు నరసింహులు, సదానందం, రమేష్, భార్గవి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఆత్మగౌరవం.. బీఆర్ఎస్

- పార్టీ ఆవిర్భావ దినోత్సవంలో జిల్లా అధ్యక్షులు ముజీబుద్దీన్

నవతెలంగాణ-కామారెడ్డి



బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొన్న నాయకులు

తెలంగాణ ఆత్మగౌరవ ప్రతిక బీఆర్ఎస్ పార్టీ అని, నీళ్ళు, నిధులు, నియామకాల కోసం పురుడుపోసుకున్న పార్టీ అని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు ముజీబుద్దీన్ అన్నారు. ఏప్రిల్ 27న తెలంగాణ సాధన కోసం కేసీఆర్ బీఆర్ఎస్ (టీఆర్ఎస్) పార్టీని స్థాపించారని అన్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఆయన నివాసం వద్ద పార్టీ జెండాను ఎగరవేశారు. అనంతరమైన మాట్లాడుతూ తెలంగాణ ప్రజలకు నీళ్ల నిధులు, నియామకాలు సాధించాలని లక్ష్యంతోనే బీఆర్ఎస్ పార్టీని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. పోరాడి సాధించుకున్న తెలంగాణను బీఆర్ఎస్ హయాంలో ఎంతో అభివృద్ధి చేసిందని 2023 లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిందన్నారు. ఎద్దు ఏడ్చిన ఎవుసం, రైతు ఏడ్చిన రాజ్యం ఎప్పటికీ బాగుపడదని రైతులకు ఇస్తానన్నారు రెండు లక్షల రుణమాఫీ 500 బోనస్ ఇప్పటివరకు ఇవ్వలేదనీ, రైతుబంధు పెంచుతామని, పెన్షన్లు పెంచుతామని చెప్పి ఇప్పటివరకు పెంచలేదు అన్నారు. కాంగ్రెస్ పార్టీ అమలు కానీ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని మీ పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్తారన్నారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి మండల ఎంపీపీ పిప్పిరి ఆంజనేయులు, సీనియర్ నాయకులు ఎంజీ వేణుగోపాల్ గౌడ్ , కామారెడ్డి నియోజకవర్గం లోని నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో చిన్నారికి గాయాలు



నవతెలంగాణ-డిచ్‌పల్లి

వీధికుక్కల దాడిలో ఓ చిన్నారి తీవ్రంగా గాయపడింది. ఈ ఘటన డిచ్‌పల్లి మండల కేంద్రంలోని ఘన్‌పూర్ గ్రామంలో శనివారం ఉదయం చోటుచేసుకుంది. చిన్నారి గ్రామంలో రోడ్డుపై ఆడుకుంటుండగా వీధికుక్క ఒక్కసారిగా దాడి చేసింది. దీంతో కింద పడిపోయిన ఆ చిన్నారి అరవడంతో గమనించిన తల్లి పరుగెతుకొచ్చి కుక్కను తరిమేసింది. ఈ ఘటనలో చిన్నారికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే చిన్నారిని ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. గ్రామంలో వీధికుక్కలు స్వైరవిహారం చేస్తున్నా గ్రామ పంచాయతీ తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి కుక్కలను నివారించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

హామీలు నెరవేర్చని నాయకులు అవసరమా..?



మాట్లాడుతున్న ప్రశాంత్‌రెడ్డి

నవతెలంగాణ-భీంగల్ రూరల్

ఇచ్చిన హామీలు అమలు చేయని కాంగ్రెస్, బిజెపిలను ఓడించి వాళ్లకి సరైన గుణపాఠం నేర్పుదామని ఎమ్మెల్యే వేముల అన్నారు. శనివారం మండలంలోని రహత్‌నగర్, దేవక్కపేట్ గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి తరపున ఎన్నికల ప్రచారంలో వేముల ప్రశాంత్‌రెడ్డి మాట్లాడారు. ఇచ్చిన హామీల అమలు కోసం ప్రజల పక్షాన పోరాడే బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డిని గెలిపించుకుందామని తెలిపారు.

కాంగ్రెస్‌తోనే అన్ని రంగాల్లో అభివృద్ధి

- కాంగ్రెస్ ఆర్మూర్ ఇంఛార్జి పి.వినయ్ కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న కాంగ్రెస్ ఇన్‌ఛార్జి వినయ్‌కుమార్ రెడ్డి

నవతెలంగాణ-మాక్లూర్

కాంగ్రెస్‌తోనే అన్ని రంగాల్లో అభివృద్ధి జరుగుతుందని కాంగ్రెస్ ఆర్మూర్ నియోజకవర్గ ఇంఛార్జి పి.వినయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని చిక్లీ, గుంజిలి, కొత్తపల్లి గ్రామాల్లో పార్లమెంట్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీలకు సైతం కలిసి ప్రచారం చేశారు. గత పాలకుల పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందన్నారు. కాంగ్రెస్ కేంద్రంలో ఉంటే ప్రతి ఒక్క అభివృద్ధి చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో మండలాధ్యక్షులు రవి ప్రకాష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు వెంకటేశ్వర్‌రావు, పంచాయతీ సంఘటన జిల్లా అధ్యక్షులు గంగాధర్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి డేగ పోశెట్టి, జైల్‌సింగ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రక్ష స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ



ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-ఆర్మూర్

రక్షా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రతీ సంవత్సరం ఎండా కాలంలో ప్రజలకు ఓఆర్ఎస్ ప్యాకెటను పంపిణీ చేయడంలో భాగంగా ఈ సంవత్సరం కూడా ఎండాకాలంలో ప్రజలకు వడ దెబ్బ తగలకుండా శనివారం పట్టణంలోని కొత్త బస్టాండ్‌లో ప్రయాణికులకు పెర్కిట్, మామిడిపల్లి ప్రాంతాలలో ప్రజలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా రక్షా స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు ఖాందేష్ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి విద్యా ప్రవీణ్ పవార్, ఉపాధ్యక్షులు జిందం నరహరి మాట్లాడుతూ.. మానవ సేవయే మాధవ సేవగా భావించి ఎండాకాలంలో ప్రజలకు వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలుపుతూ ఓఆర్ఎస్ ప్యాకెట్లను ఉచితంగా అందజేశామన్నారు. ఈ కార్యక్రమానికి ప్రాజెక్ట్ చైర్మన్‌గా డాక్టర్ బేతు గంగాధర్ వ్యవహరించారు. కార్యక్రమంలో రక్షా స్వచ్ఛంద సేవా సంస్థ ప్రధాన కార్యదర్శి విద్యా ప్రవీణ్ పవార్, ఉపాధ్యక్షులు జిందం నరహరి, విద్యా గోపి కృష్ణ, ఎస్‌జీ శ్రీకాంత్, కోశాధికారి గోనె శ్రీధర్, కార్యనిర్వాహక కార్యదర్శులు డాక్టర్ బేతు గంగాధర్, తులసి పట్వారి, సంయుక్త కార్యదర్శులు మీరా శ్రావణ్, సభ్యులు ఖాందేష్ గంగాధర్, బచ్చేవాల్ శ్రీనివాస్, విశ్వనాథ్ రాజేష్ శ్రీను, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఫార్మాసిటికల్ కెమిస్ట్రీ విభాగంలో మహమ్మద్ తౌసిఫ్ హైమద్‌కు 'పీహెచ్‌డీ ప్రదానం'



పీహెచ్‌డీ అందుకున్న అనంతరం సన్మానం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ ఫార్మసిటికల్ విభాగంలో బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ ప్రొఫెసర్ నసీం ఆధ్వర్యంలో మహమ్మద్ తౌసిఫ్ హైమద్‌కు 'ఇంపాక్ట్ ఆఫ్ వేరియబుల్ ఆక్సిడేషన్ స్టేట్స్ ఆఫ్ హెవీ మెటల్స్ ఇన్ ఎడ్సొర్షన్ ఆన్ నానో ఎడ్సార్బంట్ ఇన్ఫ్యూజ్డ్ విత్ నేచురల్ అక్యరింగ్ ఆర్గానిక్ యాసిడ్స్' అంశంపై పరిశోధన నిర్వహించి తెలంగాణ యూనివర్సిటీకి సమర్పించారు. మూల్యాంకనం అనంతరం బహిరంగ వైవాకు ఎక్స్టర్నల్ ఎగ్జామినర్ ప్రొఫెసర్ జాదవ్ రామచందర్ ఉస్మానియా యూనివర్సిటీ హాజరై సిద్ధాంత గ్రంథంపై పలు ప్రశ్నలు అడిగి సంతృప్తి వ్యక్తం చేసి పిహెచ్డి డిగ్రీ ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.యాదగిరి, సైన్స్ డీన్ ప్రొఫెసర్ ఆరతి, డిపార్ట్మెంట్ హెడ్ డాక్టర్ శిరీష బోయపాటి, డాక్టర్ వాసం చంద్రశేఖర్, డాక్టర్ సత్యనారాయణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో నెలలో 109 మంది గర్భిణులకు డెలివరీ

- ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ రవికుమార్

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణ ఏరియా ఆస్పత్రిలో ఈ నెలలో 109 డెలివరీలు చేసినట్టు ఆసుపత్రికి వచ్చి రోగులకు సిబ్బంది, సంబంధిత వైద్యులు అందుబాటులో ఉంటూ నిర్విరామ సేవలు చేస్తున్నట్టు ఆసుపత్రి సూపరింటెండెంట్ సి.రవికుమార్ శనివారం తెలిపారు. ప్రస్తుతం విపరీతమైన ఎండలు ఉండడంతో ప్రజలు బయట ఎక్కువగా తిరగవద్దని, వైద్యుల సూచనలు సలహాలు పాటించాలని కోరారు.

అభివృద్ధి, సంక్షేమం బాధ్యత నాదే

- కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించండి
- బాల్కొండ నియోజకవర్గ ఇంఛార్జి ముత్యాల సునీల్ రెడ్డి

నవతెలంగాణ-ముప్కాల్

నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమం బాధ్యత నాదేనని, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇంఛార్జి ముత్యాల సునీల్ రెడ్డి అన్నారు. మండలంలోని రెంజర్ల గ్రామంలో నిజామాబాద్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి టి.జీవన్ రెడ్డితో బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ రెడ్డి శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముత్యాల సునీల్ కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వం వచ్చిన నాలుగు నెలల్లో ఐదు గ్యారంటీ పథకాలను అమలు చేసిందని, అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు అందించే విధంగా కృషి చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వం ఆర్థిక విధ్వంసానికి పాల్పడిందని, ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం ఆర్థిక లోటును పూడుస్తూ క్రమశిక్షణతో వ్యవహరిస్తున్నట్టు గుర్తుచేశారు. ఆర్థిక ఇబ్బందులున్నప్పటికీ ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. 200ల యూనిట్లలోపు ఉచిత విద్యుత్ అందిస్తూ రూ.500 గ్యాస్ సిలిండర్ పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఆగస్టు 15లోపు రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తామని ముఖ్యమంత్రి ఇదివరకే ప్రకటించారని తెలిపారు. వచ్చే ఖరీఫ్ సీజన్ నుంచి క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తామన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా ఉండి మచ్చలేని నాయకుడైన జీవన్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. జీవన్‌రెడ్డి స్వయాన రైతు అని వ్యవసాయదారుల కష్టాలు వ్యవసాయదారుడుకి తెలుస్తాయని పార్లమెంట్‌లో నిజామాబాద్ గళం బలం వినిపించడానికి, నియోజకవర్గం అభివృద్ధి కొరకు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి జీవన్‌రెడ్డిని పార్లమెంట్‌కు పంపించాలని విజ్ఞప్తి చేశారు.

అనంతరం అభ్యర్థి జీవన్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఉపాధి హామీ ద్వారా 150 రోజుల పని దినాలు కల్పిస్తూ రోజుకు కనీస వేతనం రూ.400 రూపాయలు వచ్చే విధంగా సంవత్సరానికి రూ.40వేలు ఆదాయం వచ్చే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నామని అన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే దానిని అమలు చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. అలాగే ప్రతి పేద మహిళకు సంవత్సరానికి లక్ష రూపాయల సాయం అందే విధంగా నారీ న్యాయ్ పేరుతో కాంగ్రెస్ గ్యారంటీ ఉందని అన్నారు. అలాగే 30 లక్షల ఉద్యోగాలను భర్తీ చేసి యువకులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీనిచ్చారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే కులగణన చేపడతామని తెలిపారు. నియోజకవర్గంలో ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా సునీల్‌రెడ్డి ఉంటారని, ప్రభుత్వ పథకాలను అమలు చేసే బాధ్యత ఆయనపైనే ఉందని, నియోజకవర్గంలో ఎవరికైనా అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు అందకుంటే సునీల్‌రెడ్డిని సంప్రదించాలని ఆయన ఈ సందర్భంగా అన్నారు. గల్ఫ్ కార్మికుల పట్ల ఉదారంగా వ్యవహరించి గల్ఫ్‌లో చనిపోయిన కుటుంబాలకు రూ.5లక్షల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందిస్తుందని తెలిపారు. బిజెపి, బీఆర్ఎస్ రెండు పార్టీలు ఒకటేనని రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీని ఓడగొట్టి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని ఈ విషయంలో రాష్ట్ర ప్రజలకు రుణపడి ఉంటామన్నారు. దేశంలో నియంతలా వ్యవహరిస్తున్న బిజెపిని ఓడించి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని అందుకు బాల్కొండ నియోజకవర్గ ప్రజలంతా కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని జీవన్‌రెడ్డి ఈ సందర్భంగా ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు అన్వేష్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మగ్గిడి ముత్యం రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు చిన్నారెడ్డి, బులెట్ రాంరెడ్డి, జక్క రాజేశ్వర్, నియోజకవర్గస్థాయి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ముత్యాల సునీల్‌కుమార్‌రెడ్డి

టీయూ మాజీ రిజిస్ట్రార్ ప్రొ.నసీం సేవలు మరువలేనివి

- రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.యాదగిరి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ నసీం సేవలు యూనివర్సిటీలో మరువలేమని ఉన్నత కుటుంబంలో పుట్టి ఉన్నతమైన ఆలోచనలతో తెలంగాణ యూనివర్సిటీలో అడుగుపెట్టి పారదర్శకమైన పరిపాలన కొనసాగించారని, పరిపాలనలో మచ్చలేని వ్యక్తిగా నసీం ఉద్యోగ విరమణ చేయడం ఆనందంగా ఉందని యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.యాదగిరి అన్నారు. తెలంగాణ యూనివర్సిటీ మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ నసీం ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమాన్ని తెలంగాణ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ప్రొఫెసర్ నసీంకు పూలమాల వేసి, శాలువా కప్పి, మెమొంటో ఇచ్చి ఘనంగా సన్మానించారు. ఈ సన్మాన సభకు అధ్యక్షత వహించిన టూటా అధ్యక్షులు డాక్టర్ పున్నయ్య మాట్లాడుతూ.. ప్రొఫెసర్ నసీం విభాగాధిపతిగా, పాఠ్య ప్రణాళిక సంఘం చైర్మన్‌గా, డీన్‌గా అకాడమిక్ బాధ్యతలతో పాటు ఆడిసెల్ డైరెక్టర్‌గా, కంట్రోలర్‌గా, రిజిస్ట్రార్‌గా యూనివర్సిటీలో అంకితభావంతో పని చేశారని పేర్కొన్నారు. ప్రొఫెసర్ డాక్టర్ సత్యనారాయణ చారి మరణించిన అనంతరం ఆయన భార్య శ్రీవాణికి కారుణ్య నియామక ఉత్తర్వులను అందించారని, సెక్యూరిటీ గార్డు పవన్ తండ్రి ప్రమాదవశాత్తు చనిపోతే పవన్‌కు ఔట్‌సోర్సింగ్‌లో ఉద్యోగం ఇచ్చి ఆ కుటుంబానికి అండగా నిలబడ్డారని పేర్కొన్నారు. ఈ సన్మాన సభకు ముఖ్య అతిథిగా రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.యాదగిరి పాల్గొని మాట్లాడుతూ.. ప్రొఫెసర్ నసీం సేవలు ఎల్లప్పుడూ మరువలేమని తెలిపారు. తెలంగాణ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ కోశాధికారి డాక్టర్ ఎ.నాగరాజు మాట్లాడుతూ ప్రొఫెసర్ నసీం ఆధ్వర్యంలో పరీక్షల విభాగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చామని పేర్కొన్నారు. అసిస్టెంట్ రిజిస్ట్రార్ సాయిగౌడ్ మాట్లాడుతూ నసీం సలహాలు సూచనలతో ఎస్టాబ్లిష్మెంట్ సెక్షన్‌లో మౌలికమైన మార్పులు తీసుకొచ్చామని పేర్కొన్నారు. అనంతరం పలువురు మాట్లాడుతూ ఆయన సేవలను కొనియాడారు. సన్మాన కార్యక్రమంలో టూటా వైస్ ప్రెసిడెంట్స్ డాక్టర్ సత్యనారాయణ రెడ్డి, డాక్టర్ రాజేశ్వరి, సహాయ కార్యదర్శులు డాక్టర్ బాలకిషన్, డాక్టర్ నీలిమా, డాక్టర్ శిరీష బోయపాటి, అధ్యాపకులు డాక్టర్ వాసం చంద్రశేఖర్, డాక్టర్ కిరణ్మయి, డాక్టర్ జెవేరియా, డాక్టర్ కె.వి.రమణచారి, డాక్టర్ లక్ష్మణ్ చక్రవర్తి, డాక్టర్ పార్వతి, డాక్టర్ అబ్దుల్ కవి, డాక్టర్ స్వప్న, డాక్టర్ స్రవంతి, డాక్టర్ అలీ ఖాన్, డాక్టర్ మహేందర్ ఐలేని, జ్యోతి, విజయలక్ష్మి, ఉమాదేవి, కాంట్రాక్టు టీచర్లు తదితరులు ప్రొఫెసర్ నసిం సేవలను కొనియాడారు. సన్మాన గ్రహీత ప్రొఫెసర్ నసీం మాట్లాడుతూ.. తెలంగాణ యూనివర్సిటీలో టీచింగ్, నాన్‌టీచింగ్, విద్యార్థుల సహాయ సహకారాలతో నా వంతుగా యూనివర్సిటీ అభివృద్ధికి కృషి చేశానని పేర్కొన్నారు. తెలంగాణ యూనివర్సిటీ నాకు ఇచ్చిన ఈ అవకాశాన్ని నా జీవితంలో మర్చిపోలేనని వివరించారు.



ప్రొఫెసర్ నసీంను సన్మానిస్తున్న పలువురు

ఘనంగా బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం



జెండాను ఎగురవేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్

మాజీ ఎమ్మెల్యే, బి.ఆర్.ఎస్ జిల్లా అధ్యక్షులు ఆశన్నగారి జీవన్‌రెడ్డి ఆదేశానుసారం పట్టణ అధ్యక్షులు పూజ నరేందర్ ఆధ్వర్యంలో భారత రాష్ట్ర సమితి పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో గులాబీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2001 ఏప్రిల్‌లో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటే లక్ష్యంగా పార్టీ ఆవిర్భవించిందన్నారు. తెలంగాణ ప్రజలకు పార్టీ అంటే ఒక భరోసా అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం 2001లో కేసీఆర్ నాయకత్వంలో ఉద్యమానికి అంకురార్పణ జరిగిందని ఉద్యమాలు, పోరాటాలు, అనేకమంది త్యాగాల ఫలితంగా కేసీఆర్ నాయకత్వంలో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సాధించుకున్నామన్నారు. జూన్ 2, 2014న అధికారికంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని వివరించారు. వచ్చిన తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ నాయకత్వంలో అతి తక్కువ సమయంలో దేశంలో మరే రాష్ట్రం చేయనంత అభివృద్ధిని, పనులను చేసి చూపించారని అన్నారు. కార్యక్రమంలో జడ్పీటిసి మెట్టు సంతోష్, మాజీ సర్వసమాజ్ అధ్యక్షులు సుంకరి రవి, మాజీ కౌన్సిలర్లు రాజాబాబు, నర్మే నవీన్, సీనియర్ నాయకులు దొండి శ్యామ్, మీర శ్రావణ్, ఎస్సీ సెల్ అధ్యక్షులు జన్నేపలి రంజిత్, యువజన కమిటీ మండలాధ్యక్షుడు అగ్గు క్రాంతి, యువజన విభాగం నాయకులు శ్యాములు, మైనార్టీ నాయకులు షాహిద్, లతీఫ్, హర్షద్, సాయిలు, రమేష్, గంగాధర్, బట్టపల్లి దేవయ్య సురేష్, రవి, రాజేశ్వర్, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

నటరాజ నృత్యానికేతన్ విద్యార్థినుల ప్రదర్శన



నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణానికి చెందిన నటరాజ నృత్యనికేతన్ నాట్య గురువు బాశెట్టి మృణాళిని శిష్య బృందం శనివారం జరిగిన కార్యక్రమంలో అద్భుత ప్రదర్శన చేశారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన హరిద రచయితల సంఘం ఇందూర్ యువత స్వచ్ఛంద సేవ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ మద్దుగురి సాయిబాబాకు సన్మాన కార్యక్రమం నిర్వహించగా.. అద్భుతమైన నాట్యంతో అలరించారు. ఈ సందర్భంగా చిన్నారులకు జ్ఞాపికలతో శాలువాలతో సన్మానించారు. సమాజ సేవలో యువత ముందుండాలని గురువు భాశెట్టి మృణాళిని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

పార్లమెంటు ఎన్నికల్లో ఫాసిస్టు బీజేపీ, ఆర్ఎస్ఎస్ ఎన్‌డీఏ శక్తులను ఓడిద్దాం



మాట్లాడుతున్న వినాయక్‌రెడ్డి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

పార్లమెంటు ఎన్నికల్లో ప్రజా వ్యతిరేక కార్మిక రైతు వ్యతిరేక ఫాసిస్టు బీజేపీ ఆరెస్సెస్ ఎన్డీఏ శక్తులను ఓడించాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. తెలంగాణ సోషల్ డెమోక్రటిక్ ఫురం (టిడిఎస్ఎఫ్) ఆధ్వర్యంలో ప్రగతి నగర్ మున్నూరు కాపు కళ్యాణమండపంలో శనివారం బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా టీ.డీ.ఎస్.ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ ప్రొఫెసర్ వినాయక్ రెడ్డి మాట్లాడుతూ నరేంద్ర మోడీ ఎన్నికల ప్రచారంలో మత విద్వేష రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. తన ప్రభుత్వం పదేళ్లకాలంలో చేసిన అభివృద్ధి శూన్యం కాబట్టే, మతోన్మాదాన్ని ప్రచారంగా మార్చుకున్నాడని ఆలోచించారు. భారత జాతీయ వాదుల ఉద్యమం నేషనల్ కన్వీనర్ కష్ణ ప్రసాద్ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం కార్పొరేటు అనుకూల విధానాలు పాటిస్తూ, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తుందన్నారు. విద్యా, వైద్య రంగాలను కార్పొరేట్ కంపెనీలకు అప్పగించే ప్రయత్నాలు చేస్తుందన్నారు.

మోడీ విధానాల వల్ల మధ్యతరగతి ప్రజల జీవితాలు అతుకుల బతుకులుగా మారాయన్నారు. ప్రస్తుతం దేశం మతతత్వ విద్వేష రాజకీయాలతో అట్టుడుకుతుందన్నారు. దేశాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత విద్యార్థులు, యువత, కార్మికులు, రైతులపైనే ఉందన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న నరేంద్ర మోడీ ప్రభుత్వాన్ని, బీజేపీ పార్టీనీ పార్లమెంటు ఎన్నికల్లో ఓడించాలన్నారు. బీజేపీ, ఆరెస్సెస్, ఎన్డీఏ శక్తులను ఓడించడంలో అన్ని వర్గాల ప్రజలు, ప్రగతిశీల శక్తులు, ప్రజాస్వామ్యవాదులు కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఈ బహిరంగ సభలో హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ చంద్రకుమార్, సీపీఐ(ఎం.ఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) జాతీయ నాయకులు రాయల చంద్రశేఖర్, సీపీఐ(ఎం.ఎల్) న్యూడెమోక్రసీ జాతీయ నాయకులు జే.వీ చలపతిరావు, ఆల్ ఇండియా ఫ్రీడమ్ ఫైటర్స్ వెల్ఫేర్ జాతీయ అధ్యక్షులు సర్దార్ భక్తావర్ సింగ్, టీడీఎస్ఎఫ్ రాష్ట్ర సమన్వయకర్త నైనాల గోవర్ధన్, సీపీఐ(ఎం.ఎల్) మాస్ లైన్ జిల్లా కార్యదర్శి వనమాల కష్ణ, సీపీఐ(ఎం.ఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య, ఎస్పిఐ(యు) జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, ఆర్ఎస్పి జిల్లా కార్యదర్శి సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.



హాజరైన పలువురు

కాంగ్రెస్‌లో చేరికలు

నవతెలంగాణ-విలేకరుల బృందం

బాల్కొండ : మండల పరిధిలోని నాగపూర్ గ్రామ లిఫ్ట్ కమిటీ చైర్మన్ సరికెల చిన్నయ్య నిజామాబాద్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి జీవన్‌రెడ్డి, బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో శనివారం చేరారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని వారికి ముత్యాల సునీల్ కుమార్ సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

50 మంది కాంగ్రెస్ పార్టీలో చేరిక..

భీంగల్ రూరల్: మండలంలోని బాచన్‌పల్లి గ్రామానికి చెందిన బి.ఆర్.ఎస్ పార్టీ కార్యకర్తలు నిజామాబాద్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి జీవన్‌రెడ్డి, ముత్యాల సునీల్ కుమార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. చేరిన వారిలో వన్నెల జనార్ధన్, తిక్క బలరాం, మల్లేష్ గంగాధర్, సొసైటీ డైరెక్టర్ గాండ్ల బాలయ్య తదితరులున్నారు. అలాగే గంగాధర్, శంకర్, రాజన్న తదితరులు కూడా కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు బొదిరె స్వామి, జేజే నర్సయ్య, కుంట రమేష్, క్రాంతి, పృథ్వీరాజ్, రమేష్, పల్లె శేఖర్, కోరాడి రాజు, కోరాడి లింబాద్రి తదితరులున్నారు.

కమ్మర్‌పల్లి : వేల్పూర్ మండలం పడగల్ గ్రామానికి చెందిన తెలంగాణ సాంస్కృతిక సంఘం బహరైన్ మాజీ అధ్యక్షులు సామ చిన్న రాజారెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ మేరకు శనివారం నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జీవన్‌రెడ్డి, ముత్యాల సునీల్ కుమార్ సమక్షంలో సామ చిన్న రాజారెడ్డి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. సామ చిన్న రాజారెడ్డితోపాటు బిఆర్ఎస్ పార్టీ నాయకులు జంగం హాజీ అలాల్, అశోక్, చింతకుంట భాస్కర్, మలాల్ తిరుపతి, సుద్దపల్లి చిన్నయ్య, గాదేపల్లి సాయిరాం మరి కొంతమంది జీవన్‌రెడ్డి, ముత్యాల సునీల్ కుమార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారందరికీ జీవన్ రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

'ఫార్మసిస్ట్ హక్కుల రక్షణకు కృషి చేస్తా'

నవతెలంగాణ-మద్నూర్

ఫార్మసీ చట్టాల అమలుకు, రిజిస్టర్ ఫార్మసిస్టు హక్కుల సాధన కోసం కృషి చేస్తానని నూతనంగా ఎన్నికైన కామారెడ్డి జిల్లా ఫార్మసిస్టు సంక్షేమ సంఘం సహాయ కార్యదర్శి తైదల్‌వార్ దత్తురాం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్ర నివాసులైన దత్తురాం ఫార్మసిస్ట్ సంక్షేమ సంఘం నూతన కమిటీలో జిల్లా సహాయ కార్యదర్శిగా నియమితులైనట్లు ఫార్మసిస్ట్ సంక్షేమ సంఘం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు బత్తిని సత్యనారాయణగౌడ్ ఎన్నిక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ఫార్మాసిస్టు సంక్షేమ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి దత్తురాం మండల కేంద్రంలో ఒక పత్రిక ప్రకటన విడుదల చేస్తూ ఫార్మసిస్టు సంక్షేమ సంఘం అభివృద్ధికి, ఫార్మసి చట్టాల అమలుకు రిజిస్టర్ల ఫార్మసిస్టు హక్కుల సాధన కొరకు కృషి చేస్తానని తెలిపారు.

నేడు మంద కృష్ణ మాదిగ రాక

నవతెలంగాణ-పిట్లం

మండల కేంద్రానికి ఆదివారం మందకృష్ణ మాదిగ విచ్చేయనున్నట్లు జహీరాబాద్ పార్లమెంట్ ఎస్సీ మోర్చా ఇన్చార్జి పుల్కల్ సాయిలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జరగబోయే పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా దళిత సమ్మేళన సభాస్థలిలో ప్రసంగించనున్నారని ఆయన తెలిపారు. అందుకుగాను దళిత సోదరులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జుక్కల్ ప్రభరి పటేల్ , ప్రసాద్ , మండల బిజెపి పార్టీ అధ్యక్షులు అభినయ రెడ్డి , జిల్లా ఓబీసీ ఉపాధ్యక్షులు అశోక్ రాజ్ , సీనియర్ నాయకులు శశిధర్ , ప్రధాన కార్యదర్శి రాజు , మాజీ ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షులు జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

నీడ, నీటి సౌకర్యం కల్పించాలి

- కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలగనీయొద్దు
- ధాన్యం డబ్బులు ఎప్పటికప్పుడు రైతుల ఖాతాల్లో జమ
- అదనపు కలెక్టర్ చంద్రమోహన్

నవతెలంగాణ-దోమకొండ

కొనుగోలు కేంద్రాల్లో రైతులకు నీడ, నీటి సౌకర్యంతో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచి రైతులకు సౌకర్యాలు కల్పించాలని అదనపు కలెక్టర్ చంద్రమోహన్ సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అన్ని సౌకర్యాలు కల్పిస్తూ అధికారులను అప్రమత్తం చేయడం పట్ల రైతులు కూడా ఆనందంగా ఉన్నారని సంతోషం వ్యక్తం చేస్తున్నారని అదనపు కలెక్టర్ చంద్ర మోహన్ అన్నారు.

శనివారం బీబీపేట్ మండల కేంద్రంలో, జనగామలో, దోమకొండ మండల కేంద్రంలో, అంచనూర్, లింగుపల్లి లలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసి కేంద్రాల నిర్వహణ తీరును తెలుసుకొని



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

సంతృప్తి వ్యక్తం చేశారు. కేంద్రాలలో ఉన్న ధాన్యం తేమ శాతాన్ని పరిశీలించి, రైతులతో ముఖాముఖి అయి కొనుగోలు కేంద్రాలలో మౌలిక వసతుల ఏర్పాట్ల పట్ల వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు.

అదేవిధంగా బీబీపేట్ లోని శ్రీనివాస్ ఆగ్రో ఇండస్ట్రీస్ బాయిల్డ్ రైస్ మిల్, జనగామ లోని ఉమా మహేశ్వరీ బాయిల్డ్ రైస్ మిల్లులను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ ఊపందుకున్నదని అన్నారు. ఇదే రోజు గత యాసంగిలో 26,042 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రైతుల ఖాతాలో కోటి 70 లక్షలు వేయగా ఈ యాసంగిలో ఇప్పటి వరకు 19,492 మంది రైతుల నుండి 261 కోట్ల విలువ గల 1,18,394 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రైతులకు 125 కోట్లు చెల్లించామని అన్నారు. వడగాల్పుల నేపథ్యంలో రైతులకు ఇబ్బందులు కలగకుండా జిల్లాలోని అన్ని కేంద్రాలలో నీడ కల్పించడంతో పాటు మంచినీరు, ఓ.ఆర్.ఎస్. ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని నిర్వాహకులకు సూచించారు.

రైస్ మిల్లులలో కటింగ్ కాకుండా చూడాలని, ట్రక్ షీట్ , మిల్లర్ అకనాలెడ్జ్మెంట్ వెంటనే జారీచేసి, టాబ్ ఎంట్రీ చేసిన 48 గంటలలలోగా రైతుల ఖాతాలో డబ్బులు వేయాలని అధికారులను ఆదేశించారు. గోదాములలో, కొనుగోలు కేంద్రాలలో 11 లక్షల 33 వేల గొనె సంచులు అందుబాటులో ఉన్నాయని, కొరత రాకుండా మానిటరింగ్ చేస్తున్నామని తెలిపారు. ఎండలు బాగా ఉన్నందున కొనుగోలు కేంద్రాల వద్ద వృద్దులు ఉండవద్దని కోరారు. కాగా మిల్లులకు వచ్చిన ధాన్యాన్ని వెంటనే అన్ లోడ్ చేసుకొని లారీలను తిరిగి పంపాలని రైస్ మిల్లర్లను కోరారు. సి.ఎం.ఆర్. రైస్ ను నిర్ధారించిన గడువులోగా భారత ఆహార సంస్థకు చేరవేయాలని మిల్లు యజమానులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి మల్లికార్జున్ బాబు, డిప్యూటీ తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం



ఓటుహక్కు ప్రాముఖ్యతను వివరిస్తున్న పలువురు

నవతెలంగాణ-కామారెడ్డి

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని ఇన్స్ ఫైర్ సొసైటీ ఫర్ రూరల్ డెవలప్మెంట్ సమస్త ప్రధాన కార్యదర్శి అమృత రాజేందర్ అన్నారు. ఇన్స్ ఫైర్ సొసైటీ ఫర్ రూరల్ డెవలప్మెంట్ (ఐ.ఎస్.ఆర్.డి) స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కామారెడ్డి జిల్లా కేంద్రంలో సాందీపని డిగ్రీ కళాశాలలో ఓటు హక్కు పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో ఎన్నికలను ప్రపంచవ్యాప్తంగా కుంభమేళాగా చూడడం జరుగుతుందనీ చైతన్యశీలురైన ఓటర్లే ప్రజాస్వామ్యానికి మూలస్తంబాలు అన్నారు. భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా వినియోగించుకోవాలని యువత, విద్యార్థులు,ప్రజలు ఓటరు మహాశయులు నిస్తేజం వీడి ఓటింగ్ రోజు వంద శాతం ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. భావిభారత నిర్మాణంలో యువ ఓటర్లదే నిర్ణయాత్మక పాత్ర అని, ఓటర్లు చైతన్యవంతులు అయి ప్రజాస్వామ్య పరిరక్షణలో మనం అందరం పాలుపంచుకుని ఓటు హక్కు కలిగి ఉన్న ప్రతి ఒక్కరిని చైతన్యవంతులను చేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడుదాం అని తెలిపారు. అనంతరం ఓటరు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో సాందీపని విద్యాసంస్థల డైరెక్టర్ బాలాజీ రావు, ప్రిన్సిపల్ సాయిబాబా, ఆధ్యాపకులు భరత్, రాజు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

చాముండేశ్వరి ఆలయంలో పూజలు

నవతెలంగాణ-దోమకొండ

దోమకొండ మండల కేంద్రంలోని చాముండేశ్వరి ఆలయంలో సంకష్ట గణపతి ఎనిమిదవ వార్షికోత్సవ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. షబ్బీర్ అలీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సందర్శకులకు అన్నదాన కార్యక్రమనికి జహీరాబాద్ పార్లమెంటరీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇలియాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఇలియాస్‌కు మెమెంటో అందజేసి ఘనంగా సన్మానించారు, ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి సభ్యులు తీగల తిరుమల్ గౌడ్, సింగిల్ విండో అధ్యక్షుడు నాగరాజు రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అనంతరెడ్డి, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శులు అబ్రబోయిన స్వామి, శ్రీకాంత్, మాజీ సింగల్ విండో అధ్యక్షుడు నర్సారెడ్డి, మాజీ సి డి సి చైర్మన్ నరసయ్య, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సీతారాం మధుసూదన్, కాంగ్రెస్ నాయకులు అంకత్ నర్సింలు గోపాల్ రెడ్డి పిస్నెం నాగేంద్ర వర్మ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను నమ్మి కష్టాలు తెచ్చుకున్నాం

- గ్రామాల్లో పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్టు బీఆర్ఎస్ నాయకుల వెల్లడి



సదాశివనగర్ మండలంలో ప్రచారం చేపట్టిన నాయకులు

నవతెలంగాణ-సదాశివనగర్/గాంధారి

గత శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ చెప్పిన మాటలు నమ్మి మోసపోయామని వృద్ధులు వాపోతున్నట్టు బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. సదాశివనగర్ మండలం ధర్మ రావుపేట్, కుప్రియాల్ గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వీధుల్లో తిరుగుతుంటే వృద్ధులు వచ్చి తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నట్టు తెలిపారు. అన్నం పెట్టే కెసిఆర్‌ను కాదని, రేవంత్‌రెడ్డిని నమ్మి ఓటే వేశామని, తమకు ఇప్పుడు అర్థమవుతుందన వాపోతున్నట్టు మాజీ జడ్పీటీసీ రాజేశ్వర్‌రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బొల్లిపల్లి మహేందర్ రెడ్డి, జిల్లా పరిషత్తు కో ఆప్షన్ మెంబర్ మొయినుద్దీన్, బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.

గాంధారి : గాంధారి మండలంలోని జువ్వాడి గ్రామంలో బిఆర్ఎస్ నాయకులు తమ పార్టీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ తరపున ప్రచారం చేపట్టినట్టు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఆదేశానుసారం శుక్రవారం ఇంటింటికి తిరుగుతూ బీఆర్ఎస్ హయాంలో చేపట్టిన సంక్షేమ పథకాలపై వివరించినట్టు తెలిపారు. ఉపాధి హామీ కూలీలు, రైతులు సంపూర్ణ మద్దతు తెలియ జేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు శ్యామ్, లక్ష్మణ్ రావు, సాయిలు, మదయ్య ఉపాధి హామీ కూలీలు రైతులు పాల్గొన్నారు



గాంధారి మండలంలో ఉపాధి పని ప్రదేశంలో ప్రచారం

సురేశ్ షెట్కార్‌ను గెలిపించాలి

- పలు గ్రామాల్లో కాంగ్రెస్ నాయకుల ప్రచారం..
- పలు మండలాల్లో జోరుగా చేరికలు

నవతెలంగాణ-దోమకొండ/నాగిరెడ్డిపేట్/గాంధారి/లింగంపేట్/కామారెడ్డి

దోమకొండ మాజీ విండో చైర్మన్ రావులపల్లి నర్సారెడ్డి, అంచనూరు గ్రామ ఎంపీటీసీ దోర్నాల లక్ష్మి, మండల బీఆర్ఎస్‌పార్టీ మైనారిటీ అధ్యక్షులు హసన్, పలువురు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కామారెడ్డి జిల్లా కేంద్రంలోని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు మహ్మద్ షబ్బీర్ అలీ సమక్షంలో శనివారం కాంగ్రెస్‌పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మహ్మద్ షబ్బీర్ అలీ మాట్లాడుతూ.. రాష్టంలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమనికి ప్రభుత్వం కృషి చేస్తుందని, ఎంపీ ఎన్నికలలో కాంగ్రెస్‌పార్టీ ఎంపీ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యులు తిరుమలగౌడ్, మండల అధ్యక్షుడు అనంతరెడ్డి, రామస్వామిగౌడ్, కమిటీ ప్రధాన కార్యదర్శి అబ్రబోయిన స్వామి, నాయకులు రామ స్వామిగౌడ్, సీతారాం మధు, పెద్దిరెడ్డి సిద్దారెడ్డి, నాయకులు ఉన్నారు.

నాగిరెడ్డిపేట్ : మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ ప్రచారం జోరుగా కొనసాగుతుంది. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి సురేష్ షట్కార్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరుతున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తే భారీ స్పందన వస్తుందని కచ్చితంగా జహీరాబాద్ పార్లమెంట్ స్థానం కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుందని వారు ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మణ్, షకీల్, మన్నెవెంకటి, సాయగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్



బైక్ ర్యాలీలో నాయకులతో కలిసి బైక్ నడుపుతున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

గాంధారి : మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురు మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బిఆర్ఎస్ నాయకులు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మోహన్ నాయక్ ఆధ్వర్యంలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో శనివారం చేరారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో తిప్పారు తండా మాజీ సర్పంచ్ బిషన్‌నాయక్, దుర్గం మాజీ ఎంపీటీసీ సభ్యుడు శంకర్, తిప్పారం గ్రామానికి చెందిన చందర్‌రావు కాంగ్రెస్‌లో చేరారు.

లింగంపేట్ : లింగంపేట్ మండలంలోని కోమటిపల్లి గ్రామ తాజా మాజీ సర్పంచ్ సుగుణ రమేష్ బిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి శనివారం సాయంత్రం కాంగ్రెస్ పార్టీలో చేరారు.లింగంపేట మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు వారికి కాంగ్రెస్ పార్టీ కాండవలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. లింగంపేట్ మండలం కోమట్పల్లి మాజీ సర్పంచ్ సుగుణ రమేష్ గౌడ్, వార్డ్ మెంబర్లు ప్రభాకర్,లక్ష్మణ్ సాయి రెడ్డి, పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు డిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేశారు. ఎల్లారెడ్డి మండలం మత్తమాల మాజీ సర్పంచ్ అశోక్ రెడ్డి పద్మారావు గ్రామ ముదిరాజ్ సంఘం అధ్యక్షులు గ్రామ టిఆర్ఎస్ కమిటీ అధ్యక్షులు బి ఆర్ ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు వారికి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో లింగంపేట్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు బుర్ర నారా గౌడ్, ఎల్లారెడ్డి మండల అధ్యక్షుడు సాయిబాబా, ఎల్లారెడ్డి జెడ్పిటిసి ఉషా గౌడ్, మోతే మాజీ సర్పంచ్ రామ్ రెడ్డి, యూత్ అధ్యక్షులు రాజు మండల కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

కామారెడ్డి : మాచారెడ్డి మండలం నుండి వివిధ పార్టీలకు చెందిన సుమారు 350 మంది షబ్బీర్ అలీ , సురేష్ శెట్కార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీలో చేరినవారికి మమ్మద్ అలీ షబ్బీర్, సురేష్ శెట్కార్ లు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికలో జహీరాబాద్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సురేష్ శెట్కార్ ను భారీ మెజారిటీతో గెలిపిస్తామని తెలిపారు.





దోమకొండ : షబ్బీర్ అలీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న పలువురు.. గాంధారి : మదన్‌మోహన్‌రావు సమక్షంలో.. నాగిరెడ్డిపేట్ : కాంగ్రెస్ ప్రచారం

సభా స్థలాన్ని పరిశీలించిన మున్సిపల్ చైర్ పర్సన్



సభా స్థలాన్ని, ఏర్పాట్లను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్, నాయకులు

నవతెలంగాణ-కామారెడ్డి

పార్లమెంటు ఎన్నికల సందర్భంగా ఆదివారం (నేడు) జరగబోయే కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి నియోజ కవర్గ కార్యకర్తల ముఖ్య సమావేశ కార్యక్రమం సందర్భంగా ఏర్పాటు చేసే సభ స్థలాన్ని మున్సిపల్ చైర్స్ పర్సన్ గడ్డం హిందూ ప్రియ చంద్రశేఖర్ రెడ్డి పరిశీలించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ షబ్బీర్ అలీ , జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి సురేష్ షెట్కర్ విచ్చేస్తున్న సందర్భంగా శనివారం సభస్థలాన్ని కామారెడ్డి పట్టణ కౌన్సిలర్లతో కలిసి పరిశీలించారు.

ప్రైవేటు పాఠశాలలు ఇంటింటి ప్రచారాలు మానుకోవాలి

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు పాఠశాలలు నిబంధనలకు విరుద్ధంగా ఇంటింటి ప్రచారాల పేరుతో ఉపాధ్యాయులను మార్కెటింగ్ ఏజెంట్లుగా యాజమాన్యాలు మార్చివేశాయని టీఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బాలు విమర్శించారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. విద్యా హక్కు చట్టం ప్రకారం పాఠశాలలు ఇంటింటి ప్రచారాలు చేయకూడదని నిబంధన ఉన్నప్పటికీ వాటిని పాటించకుండా, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఉపాధ్యాయులను ఇబ్బందుల గురి చేస్తూ ప్రచారాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. వెంటనే ఇంటింటి ప్రచారాలు మానుకోవాలని లేకపోతే ప్రచారం నిర్వహించే పాఠశాల ప్రధానోపాధ్యాయులు, యాజమాన్యం పైన క్రిమినల్ కేసులు నమోదు అయ్యేలాగా పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. నిన్నటి రోజున నకిరేకల్ లో ప్రైవేటు ఉపాధ్యాయురాలు ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ ఎండ దెబ్బ తగిలి మృతిచెందినట్టు తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారి వెంటనే స్పందించి నిబంధనలకు విరుద్ధంగా వివరిస్తున్న పాఠశాల పైన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ పార్లమెంట్ అధ్యక్షుడు అంజల్ రెడ్డి, రాజు, నవీన్, సందీప్, సతీష్, మహేష్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఆయాల లేమితో ఇక్కట్లలో అంగన్‌వాడీలు



అంగన్‌వాడీ కేంద్రం(ఫైల్)

- ఒక వైపు పిల్లల ఆలనపాలన, వంట.. మరో వైపు సమావేశాలు, సమీక్షలు, సర్వేలు
- ఊపిరిసలపని విధంగా పనిఒత్తిడి
- తాత్కాలికంగా ఆయాలను ఏర్పాటు చేయాలని విన్నపాలు

నవతెలంగాణ-పిట్లం

పలు అంగన్‌వాడీ సెంటర్లలో ఆయాలు వివిధ కారణాలవల్ల మృతిచెందినప్పటికీ అట్టి సెంటర్లలో గత ప్రభుత్వం ఆయా పోస్టులను భర్తీ చేపట్టలేకపోవడంతో టీచర్లు మానసిక ఆవేదనకు గురవుతున్నారు. అయినప్పటికీ సంబంధిత శాఖ ఉన్నత అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తూ, ఆ పైగా టీచర్లను అది చేయాలి , ఇది చేయాలి అంటూ దబాయిస్తున్నారని ఆందోళన వ్యక్తపరుస్తున్నారు.

మండలంలో పిట్లం , చిన్న కొడప్ గల్ , రాంపూర్ సేక్టర్లకు గాను పిట్లం అంగన్‌వాడీ సెంటర్ 3 , తిమ్మా నగర్ సెంటర్ 1 , గౌరారం సెంటర్ ఆయాలు మూడు సంవత్సరాల క్రితం ఒకరు వృద్ధాప్యంతో క్యాన్సర్ సోకి మృతి చెందారు. మరొకరు పాము కాటుకు, మరొకరు వృద్ధాప్యంలో వచ్చిన ఆరోగ్య సమస్యలతో మృతి చెందారు. అట్టి సెంటర్‌లలో ఇప్పటికీ కొత్తగా ఆయాలను నియమించలేదు. దీంతో సమావేశాలు, ఇతర సర్వేలున్న సమయాల్లో టీచర్‌లు లేక, ఆయాలు లేక సెంటర్‌లు నడపడం కష్టతరంగా మారడంతో అంగన్‌వాడీ టీచర్‌లు తమ సొంత డబ్బులు 2 నుంచి 3 వేల రూపాయలు వెచ్చించి ప్రయివేటు వ్యక్తులతో ఆయా పనులు చేయించుకున్నారు. రెండేళ్ల కాలం అనంతరం ప్రైవేటు వ్యక్తులు అడపా దడపా పనులు చేసి పెట్టినప్పటికీ 3వ సంవత్సరంలో ఎవరు కూడా ఆయా పనులు చేయడానికి సుముఖత చూపలేకపోతున్నారు. అట్టి అంగన్వాడి సెంటర్ల టీచర్లు అటు ఉన్నతాధికారుల, ఇటు లబ్ధిదారుల వేదనకు బలి అవుతున్నారు. ఆయాలు లేకున్నప్పటికీ అధికారుల ఒత్తిళ్ల రోజురోజుకు పెరిగిపోతున్నాయి. ఆయా పనితోపాటు స్కూల్ రన్నింగ్ , మరో పక్క సర్వే చేయాలని ఒత్తిడి తేవడంతో టీచర్లు మానసిక మనోవేదనకు గురవుతూ , శారీరక ఇబ్బందులతో సతమతమవుతున్నారు.

సంబంధిత శాఖ అధికారులలో కనికరం లేకుండా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం ఆయా పోస్టులు భర్తీ చేసే వరకు తాత్కాలిక ఆయాలకు నియమించి వారికి సంబంధిత శాఖ తరఫున పారితోషకం అందజేయాలని ఉన్నత అధికారులను కోరుతున్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

వేల్పూర్ మండలంలోని పచ్చల నడ్కుడ గ్రామానికి చెందిన అంకన్నగారి నడిపి సాయిలు కుటుంబ సభ్యులను బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, బాల్కొండ బిజెపి ఇంచార్జ్ డాక్టర్ ఏలేటి మల్లికార్జున్‌రెడ్డి శనివారం పరామర్శిం చారు. ఇటీవల అనారోగ్యంతో అంకన్న గారి సాయిలు అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మల్లికార్జున్‌రెడ్డి మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనారోగ్యానికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అంకన్నగారి సాయిలు మృతి పట్ల తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఏలేటి మల్లికార్జున్‌రెడ్డి వెంట బిజెపి రాష్ట్ర నాయకులు రెంజర్ల గంగారం, బిజెపి మండల నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మల్లికార్జున్‌రెడ్డి

ఓటర్ స్లిప్పులు పంపిణీ

నవతెలంగాణ-ముప్కాల్

పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా శనివారం ఉదయం మండల కేంద్రంతో పాటు మండలంలోని వేంపల్లి, నల్లూర్, నాగంపేట్, రెంజర్ల, వెంచిర్యాల, కొత్తపల్లి గ్రామాల్లో ఓటర్లకు ఓటరు స్లిప్పులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వనజ రాణి మాట్లాడుతూ వయోజనులు తప్పనిసరిగా తమ ఓటు హక్కును కచ్చితంగా వినియోగించుకోవాలని సూచించారు. ఓటు హక్కు ప్రతి పౌరునికి భారత రాజ్యాంగం కల్పించిన హక్కు అని తెలియజేశారు. కాబట్టి ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామాల్లో బూతుల వారిగా ఓటర్లకు ఓటరు స్లిప్పులను అందజేశారు. వచ్చే నెల మే 13న జరిగే లోకసభ ఎన్నికల పోలింగ్‌లో ఓటర్లు నిష్పక్షపాతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహశీల్దార్ వనజ రాణి, డిప్యూటీ తహశీల్దార్ శ్రీకాంత్, ఆర్ఐ గంగారాం, బీఎల్వోలు పాల్గొన్నారు.



ఎన్నికల నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

- రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు
- నోడల్ అధికారులతో సమావేశమైన ఎలక్షన్ అబ్జర్వర్లు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ పార్లమెంటు నియోజకవర్గ స్థానానికి ఎన్నికల నిర్వహణ కోసం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నామని, ఎన్నికల ప్రవర్తనా నియమావళి పక్కాగా అమలయ్యేలా పకడ్బందీ చర్యలు చేపట్టామని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. లోక్ సభ ఎన్నికలను పురస్కరించుకుని నిజామాబాద్ జిల్లాకు నియమితులైన ఎన్నికల సాధారణ పరిశీలకులు ఎలిస్ వజ్ ఆర్, వ్యయ పరిశీలకులు డీ.ఎం.నెమ్మి, పోలీస్ శాఖకు సంబంధించిన అబ్జర్వర్ రాజేష్ మీనాలు శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని నిజామాబాద్, జగిత్యాల జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఉన్నతాధికారులు, నోడల్ ఆఫీసర్లతో భేటీ అయ్యారు. రిటర్నింగ్ అధికారి, నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్, జగిత్యాల కలెక్టర్ డాక్టర్ యాస్మీన్ బాషా, ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ తదితరులు పరిశీలకులతో భేటీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్లమెంటు సెగ్మెంట్ పరిధిలో ఎన్నికల నియమావళి అమలు, పోలింగ్, కౌంటింగ్ నిర్వహణకు చేపట్టిన చర్యల గురించి రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అబ్జర్వర్లకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. పార్లమెంటు సెగ్మెంట్ పరిధిలో నిజామాబాద్ జిల్లాలోని బోధన్, నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్, ఆర్మూర్, బాల్కొండ అసెంబ్లీ నియోజకవర్గాలతో పాటు, జగిత్యాల జిల్లాలోని కోరుట్ల, జగిత్యాల అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయని వివరించారు. మొత్తం 17,04,867 మంది ఓటర్లు ఉండగా, 944 ప్రాంతాలలో 1808 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని అన్నారు. వాటిలో నిజామాబాద్ జిల్లాలో 1288 పోలింగ్ స్టేషన్లు, జగిత్యాల జిల్లాలో 516 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. వీటితో పాటు బాల్కొండ అసెంబ్లీ సెగ్మెంట్‌కు సంబంధించిన నాలుగు పోలింగ్ పోలింగ్ కేంద్రాలు రాజన్న సిరిసిల్ల జిల్లాలోకి వస్తాయని తెలిపారు. ఎన్నికల నియమావళి తు.చ తప్పకుండా అమలయ్యేలా అన్ని చర్యలు తీసుకున్నామని, సంబంధిత కమిటీలను నియమించి పకడ్బందీ పర్యవేక్షణ చేస్తున్నామని అన్నారు. అభ్యర్థులు, ఆయా పార్టీల ఎన్నికల వ్యయాన్ని లెక్కించేందుకు ఏర్పాటు చేసిన కమిటీలు ఇప్పటికే క్షేత్రస్థాయి నుంచి అన్ని విధాలుగా పరిశీలన జరుపుతున్నాయని తెలిపారు. ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభాలకు గురి చేయకుండా నగదు, మద్యం, ఇతర వస్తువుల పంపిణీపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నాటి నుంచి ఇప్పటివరకు జిల్లాలో రూ.1.22 కోట్ల నగదు, రూ.1.28 కోట్ల రూపాయల విలువ చేసే బంగారం, ఇతర విలువైన వస్తువులను సీజ్ చేసినట్టు తెలిపారు. అలాగే, పోలీసులు, ఎక్సైజ్ శాఖల ద్వారా 52 వేల లీటర్ల అక్రమ మద్యం నిల్వలను గుర్తించి సీజ్ చేశారని వివరించారు. ఎఫ్.ఎస్.టీ, ఎస్.ఎస్.టీ బృందాలు నిరంతరం సోదాలు నిర్వహిస్తున్నాయని, పట్టుబడిన నగదుకు సంబంధించి ఆధారాలు కలిగి ఉన్న వారికి గ్రీవెన్స్ కమిటీ ద్వారా పరిశీలన జరిపించి నగదును తిరిగి అందజేస్తున్నామని తెలిపారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘనకు సంబంధించిన ఫిర్యాదులు స్వీకరించేందుకు వీలుగా ఐడిఓసిలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, సి.విజిల్, 1950 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా కూడా ఫిర్యాదులు వస్తున్నాయని అన్నారు. ఫిర్యాదులు అందిన వెంటనే ఎఫ్.ఎస్.టీ, ఎస్.ఎస్.టీ బృందాలు తక్షణం స్పందించేలా చర్యలు తీసుకున్నామని, వారి వాహనాలకు అధునాతన పీటీజెడ్ కెమెరాలను ఏర్పాటు చేసి కంట్రోల్ రూమ్ ద్వారా పర్యవేక్షణ చేస్తున్నామని వివరించారు. అలాగే సరిహద్దున గల మహారాష్ట్ర నుంచి మద్యం, ఇతర వస్తువులను జిల్లాకు అక్రమంగా తరలించకుండా సరిహద్దు ప్రాంతాల్లో నాలుగు చోట్ల అంతర్రాష్ట్ర చెక్ పోస్టులను ఏర్పాటు చేసి, సి.సి కెమెరాల ద్వారా పర్యవేక్షిస్తున్నామని అన్నారు. కాగా, ఈవీఎంల మొదటి ర్యాండమైజెషన్ ప్రక్రియను పూర్తి చేసి ఓటింగ్ యంత్రాలను నియోజకవర్గ కేంద్రాలకు తరలించి స్ట్రాంగ్ రూంలలో భద్రపర్చామని, మొత్తం బ్యాలెట్ యూనిట్లు 2257, కంట్రోల్ యూనిట్లు 2257, వి.వి.ప్యాట్లు 2527 అందుబాటులో ఉన్నాయని అన్నారు. 15 మంది కన్నా ఎక్కువ సంఖ్యలో అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచిన పక్షంలో అదనంగా బ్యాలెట్ యూనిట్లను కేటాయించేలా ఏర్పాట్లు చేసుకున్నామని తెలిపారు. పోలింగ్ సిబ్బందికి సైతం మొదటి విడత శిక్షణ తరగతులు పూర్తి చేశామని కలెక్టర్ తెలిపారు. మే 1, 2వ తేదీలలో రెండవ దఫా శిక్షణకు ఏర్పాట్లు చేశామన్నారు. పార్లమెంటు సెగ్మెంట్‌ను 184 రూట్లుగా విభజిస్తూ 202 మంది సెక్టోరల్ అధికారులను నియమించామని అన్నారు. మొత్తం పోలింగ్ కేంద్రాలలో 509 కేంద్రాలను సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లుగా గుర్తిస్తూ, అదనపు బలగాలను మోహరిస్తున్నామని అన్నారు. అర్హులైన ఓటర్లు అందరు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ, సిబ్బందిచే ఇంటింటికి తిరుగుతూ ఓటరు సమాచార స్లిప్పులు పంపిణీ చేయిస్తున్నామని తెలిపారు.



మాట్లాడుతున్న ఎన్నికల పరిశీలకులు


సమావేశంలో పాల్గొన్న అధికారులు

గడిచిన రెండు రోజులలో 85 వేల పైచిలుకు స్లిప్పుల పంపిణీ పూర్తయ్యిందని వివరించారు. 85 ఏండ్లు పైబడిన సీనియర్ సిటిజన్ ఓటర్లు 9878 మంది, దివ్యాంగ ఓటర్లు 41,190 మంది ఉండగా, ముందస్తుగానే వారికి 12-డీ ఫారాలు అందించడం జరిగిందన్నారు. వీరిలో 85 ఏండ్లు పైబడిన వారు 899 మంది దరఖాస్తులు చేసుకోగా వాటిలో 859 మంది దరఖాస్తులను అర్హులుగా గుర్తించామని తెలిపారు. దివ్యాంగ ఓటర్లలో 1027 దరఖాస్తులు రాగా, వాటిలో 899 మంది అర్హత కలిగి ఉన్నట్లు నిర్ధారించామని అన్నారు. ఇంటి నుండి ఓటు వేసేందుకు దరఖాస్తు చేసుకున్న వారి ఓటును సేకరించేందుకు వీలుగా పోలింగ్ బృందాలను నియమించామని, ఈ.సీ మార్గదర్శకాలకు అనుగుణంగా వారి ఇళ్లకు వెళ్లి గోప్యతను పాటిస్తూ ఓటింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. సీనియర్ సిటిజన్లు, దివ్యంగ ఓటర్లతో పాటు ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న అత్యవసర సర్వీసులకు చెందిన వారిని కలుపుకుని మొత్తం 2012 దరఖాస్తులు రాగా, 1844 మంది అర్హులుగా గుర్తించబడ్డారని కలెక్టర్ వివరించారు. కాగా, డిచ్‌పల్లిలోని సి.ఎం.సి కళాశాలలో ఓట్ల లెక్కింపునకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు.

జగిత్యాల జిల్లా కలెక్టర్ యాస్మీన్ బాషా మాట్లాడుతూ, పార్లమెంట్ ఎన్నిక సందర్భంగా కోరుట్ల, జగిత్యాల అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో చేపట్టిన ఏర్పాట్ల గురించి పరిశీలకుల దృష్టికి తెచ్చారు. పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ మాట్లాడుతూ, ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ప్రశాంత వాతావరణం నెలకొని ఉందని, ఎక్కడ కూడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోలేదని పరిశీలకుల దృష్టికి తెచ్చారు. ఓటర్లను ప్రలోభపర్చే చర్యలను నిరోధించేందుకు వీలుగా జిల్లా సరిహద్దులలో నాలుగు అంతర్ రాష్ట్ర చెక్‌పోస్టులు, నెలకొల్పి నిరంతరం తనిఖీలు జరిపిస్తున్నామని, ఇవే కాకుండా జిల్లా అంతటా డైనమిక్ చెక్ పోస్టులను ఏర్పాటు చేశామని వివరించారు. పొరుగున గల మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా పోలీసులతో సమన్వయ సమావేశం నిర్వహించి సరిహద్దు ప్రాంతం నుంచి అక్రమ మద్యం, నగదు, ఇతర వస్తువులు రాకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఓటింగ్ ప్రక్రియ సజావుగా జరిగేలా అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు నియమిస్తున్నామని, సమస్యాత్మక కేంద్రాల వద్ద ప్రత్యేక దృష్టిని కేంద్రీకరిస్తున్నామని అన్నారు. స్థానిక పోలీసు సిబ్బందితో పాటు మూడు కంపెనీల పారామిలిటరీ బలగాలు ఇప్పటికే జిల్లాకు చేరుకున్నాయని, సీ.ఆర్.పీ.ఎఫ్ బలగాలతో ఆయా ప్రాంతాల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహింపజేశామని సీ.పీ వివరించారు. ఎక్కడైనా శాంతిభద్రతల సమస్య ఉత్పన్నమైతే తక్షణమే స్పందించేందుకు వీలుగా క్విక్ రియాక్షన్ టీమ్ (క్యూ.ఆర్.టీ), స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల ప్రచార సభలు, సమావేశాలు, ర్యాలీలను నిశితంగా పరిశీలిస్తూ, సాధారణ ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా పర్యవేక్షణ జరుపుతున్నామని, నియమావళిని అతిక్రమించే వారిపై కేసులు నమోదు చేస్తున్నామని అన్నారు. ఇప్పటివరకు పాత నేరస్థులు, రౌడీ షీట్ కలిగి ఉన్న 943 మందిని బైండోవర్ చేశామని, లైసెన్సులు కలిగి ఉన్న 76 ఆయుధాలను డిపాజిట్ చేయించామని వివరించారు. ఈ సందర్భంగా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ఏర్పాటు చేసిన మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ సెంటర్, కంట్రోల్ రూంలను పరిశీలకులు సందర్శించి పనితీరును పరిశీలించారు. వీరి వెంట అదనపు కలెక్టర్ అంకిత్, నగర పాలక సంస్థ కమిషనర్ మకరంద్, ఇతర జిల్లా అధికారులు ఉన్నారు.

రేణుక ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవ వేడుకలు

- రేణుక ఎల్లమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రం శివారులోని శీగిరి క్షేత్రం సమీపంలోని రేణుక ఎల్లమ్మ ఆలయ ఐదవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఉత్సవాలలో భాగంగా శనివారం స్థానిక గౌడ సంఘం ఆధ్వర్యంలో రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద అన్న వితరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. గౌడ సంఘం సభ్యులు ఆహ్వానం మేరకు మాజీ మంత్రి బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి రేణుక ఎల్లమ్మను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, ప్రశాంత్‌రెడ్డికి ఆశీర్వచనాలు అందించారు. గౌడ సంఘం సభ్యులు ఎమ్మెల్యేలను అమ్మవారి కండువా, శాలువాతో సత్కరించారు. ఉదయం నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు ఆలయం వద్ద బారులు తీరారు. దర్శనం అనంతరం అన్నప్రసాదాన్ని స్వీకరించారు. రేణుక ఎల్లమ్మ ఉత్సవాలు ఐదు రోజులపాటు కొనసాగుతాయని ఈ సందర్భంగా గౌడ సంఘం అధ్యక్షులు మల్యాల సుభాష్‌గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు మైలారం సుధాకర్, బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షులు రేగుంట దేవేందర్, మాజీ మండల అధ్యక్షుడు లుక్క గంగాధర్, పలువురు బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గౌడ సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.


రేణుక ఎల్లమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డిని గెలిపించండి

- మాజీ ఎమ్మెల్సీ మోహన్ రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్

కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి ఎమ్మెల్సీ జీవన్ రెడ్డిని ఎంపీగా గెలిపించాలని, పెన్షనర్స్ హక్కులు సాధించాలని మాజీ ఎమ్మెల్సీ భట్టాపూర్ మోహన్‌రెడ్డి అన్నారు. పట్టణంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఉపాధ్యాయ ఉద్యోగులకు, పెన్షనర్స్‌కు అనేక సమస్యలున్నాయని వాటిని పరిష్కరించాలంటే ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని ఎంపీగా గెలిపించాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఉద్యోగులకు ఉపాధ్యాయులకు పెన్షనర్స్‌కు ఐదవ తారీకు వేతనాలు అందిస్తుందని, ఎంపీ ఎలక్షన్స్ తర్వాత కూడా అలాగే అందిస్తుందని తెలిపారు. ఎంపీగా జీవన్‌రెడ్డి గెలవగానే ఉద్యోగుల సమస్యలపై సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి చాలా అనుభవజ్ఞుడని అన్నారు. సమస్యలపై కొట్లాడే వ్యక్తి జీవన్‌రెడ్డి అని వివరించారు. పార్లమెంట్ ఎన్నికల్లో జీవన్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ మోహన్‌రెడ్డి

ఉపాధి పనిముట్లను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేయాలి

- భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు సయ్యద్ మహిమూద్

నవతెలంగాణ-ముప్కాల్

పనిముట్లను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేయాలని భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు సయ్యద్ మహిమూద్ తెలిపారు. శనివారం ఉపాధి హామీ కూలీలు చేస్తున్న పనుల వద్దకు వెళ్లి కూలీలతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి హామీ కూలీలకు రూ.600 కూలి డబ్బులు ఇవ్వాలని, సంవత్సరానికి 200 రోజుల పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. దాదాపు 40 డిగ్రీల ఉష్ణోగ్రతలో కూలీలు పని చేస్తున్నారని వాపోయారు.

వారి సౌకర్యార్థం కూలీలకు టెంట్ ఏర్పాటు చేయాల్సివుండగా ఏర్పాటు చేయకపోవడం, మెడికల్ కిట్ అందుబాటులో లేకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. వారానికి ఒకసారి కూలి డబ్బులు పంచాలని, వారం వారం చేసిన కూలీల పని దినాలను చూపుతూ తోక చిట్టీలు అందజేయాలని సూచించారు.

ఉపాధిహామీ ద్వారా కూలీలకు అవసరమైన పనిముట్లను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో భారత రైతు కూలీ సంఘం జిల్లా సభ్యులు, ఫీల్డ్ అసిస్టెంట్ కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రైతు కూలీ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు సయ్యద్ మహిమూద్


ఎంసిఎంసి కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, పరిశీలకులు నెమ్మి, అబ్జర్వర్ రాజేష్ మీనా

ఎంసిఎంసి కేంద్రాన్ని సందర్శించిన పరిశీలకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

పార్లమెంటు ఎన్నికలను పురస్కరించుకుని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ఏర్పాటు చేసిన మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసిఎంసి) సెంటర్‌ను ఎన్నికల సాధారణ పరిశీలకులు ఎలిస్ వజ్ ఆర్, వ్యయ పరిశీలకులు డీ.ఎం.నెమ్మి, పోలీస్ శాఖకు సంబంధించిన అబ్జర్వర్ రాజేష్ మీనా శనివారం పరిశీలించారు. నిజామాబాద్ పార్లమెంటు నియోజకవర్గ ఎన్నిక సందర్భంగా ఎంసిఎంసి ద్వారా చేపడుతున్న కార్యకలాపాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఎంసిఎంసి కేంద్రంలోని రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఐ.డి.ఓ.సిలో నెలకొల్పిన కంట్రోల్ రూంను సందర్శించారు. 1950 టోల్ ఫ్రీ ద్వారా వస్తున్న ఫిర్యాదులు, వాటిని పరిష్కరిస్తున్న తీరుతెన్నులు గమనించారు. చెక్‌పోస్టుల వద్ద ఎస్.ఎస్.టీ బృందాల పనితీరును, అలాగే ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాల పనితీరును కంట్రోల్ రూంలో జీపీఆర్ఎస్ విధానం ద్వారా పర్యవేక్షిస్తున్న విధానాన్ని పరిశీలించారు. అబ్జర్వర్ల వెంట కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్ అంకిత్, నగర పాలక సంస్థ కమిషనర్ మకరందు, ఎంసిఎంసి కమిటీ సభ్య కార్యదర్శి ఎస్.పద్మశ్రీ, నోడల్ అధికారి పాపయ్య తదితరులున్నారు.

లైబ్రరీకి వాటర్‌ప్యూరిఫై అందజేత

నవతెలంగాణ-బోధన్

పట్టణంలోని గ్రంథాలయానికి సమాజ సేవకురాలు సరోజనమ్మ శనివారం వాటర్ ప్యూరిఫై మిషన్‌ను అందించారు. గ్రంథాలయానికి చదువుకోడానికి వచ్చే పాఠకులకు తాగు నీటి సౌకర్యార్థం తన సొంత నిధులతో ఆమే వాటర్‌ప్యూరిఫై మిషన్‌ను కొనుగోలు చేసి అందించారు. ఈ సందర్భంగా పట్టణ ప్రముఖులు ఆమే దాతృత్వానికి హర్షం వ్యక్తం చేశారు. అనంతరం సరోజనమ్మను పలువురు పూలమాలలు, శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు దాము, అద్దంకి ఊషన్, పద్మాసింగ్ తదితరులున్నారు.



ప్యూరిఫైను ప్రారంభిస్తున్న సరోజనమ్మ

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన పుల్లూరి అలేఖ్య కృష్ణ

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని క్వీన్స్ జిమ్ తరపున కోచ్ రచన రాఘవ గారి సారథ్యంలో శిక్షణ పొందిన పుల్లూరి అలేఖ్య కృష్ణ శనివారం డబ్ల్యూపిసి పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్షిప్ రాష్ట్రస్థాయి ఎంపిక పోటీల్లో బహుమతులు పొందారు. మహిళ విభాగంలో బెంజ్ ప్రెస్, డేడ్ లిఫ్ట్‌లో 35కేజీలు, 100కేజీలు ఎత్తి రెండు గోల్డ్ మెడల్స్, డబ్ల్యూపిసి స్టేట్ ప్రెసిడెంట్ మిస్సెస్ రేఖ చేతుల మీదుగా తీసుకొని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు క్వీన్స్ జిమ్ వ్యవస్థాపకులు రచన రాఘవ్ తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.



6 గ్యారెంటీలు.. 420 హామీలు..

కాంగ్రెస్ పార్టీ బుడ్డర్ఖాన్ మాటలు నమ్మొద్దు

అరవింద్.. ఐదు రోజుల్లో తెస్తానన్న పసుపు బోర్డు ఎక్కడ..?

- బీఆర్ఎస్ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ ఘాటు వ్యాఖ్యలు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

కాంగ్రెస్ అధికారంలోకి రాకముందు ప్రజలకు 6 గ్యారెంటీలు.. 420 హామీలు ఇచ్చి అమలు చేయలేదని, కాంగ్రెస్ పార్టీ బుడ్డర్ఖాన్ మాటలను నమ్మవద్దని బీఆర్ఎస్ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ సూచించారు. 'గత పార్లమెంట్ ఎన్నికల సమయంలో బిజెపి అభ్యర్థి అర్వింద్ ఐదు రోజుల్లో తెస్తానన్న పసుపు బోర్డు ఎక్కడ ఉంది?, బోధన్ షుగర్ ఫ్యాక్టరీ సొంత డబ్బులతో తెరిపిస్తా అన్నావు కదా. ఎక్కడ తెరిపించావు..?' అని ప్రశ్నించారు. కాంగ్రెస్ వంద రోజుల్లో అమలు చేస్తానన్న పథకాలు ఎక్కడ?, నేటికీ 136 రోజులు అయిందని తెలిపారు. నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ఎన్నికల సన్నాహక బీఆర్ఎస్ పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశాన్ని మండలంలోని బర్దిపూర్ శివారులోని ఫంక్షన్‌హాల్‌లో నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్, జిల్లా పరిషత్ చైర్మన్ విట్టల్‌రావు, మాజీ ఎమ్మెల్సీ వి.జి.గంగాధర్‌గౌడ్, జిల్లా యువ నాయకులు, జిల్లా ఒలంపిక్ ఉపాధ్యక్షులు, ధర్పల్లి జడ్పిటిసి బాజిరెడ్డి జగన్మోహన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ.. ఓడ ఎక్కేదాకా ఓడ మల్లన్న.. ఓడ దిగిన తరవాత బోడి మల్లన్న అన్నట్లు రేవంత్ తీరు ఉందని మండిపడ్డారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో రైతు రుణమాఫీ, రైతు భరోసా అంటూ మాయమాటలు చెప్పి, ఇప్పుడు సీఎం అయ్యాక రైతుల దిక్కు కూడా చూడకుండా హైదరాబాద్ - ఢిల్లీ చక్కర్లు కొడ్తున్న మోసకారి రేవంత్‌రెడ్డి అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు దురాశకు పోయి దుఃఖాన్ని తెచ్చుకున్నారని వివరించారు. కాంగ్రెస్ అబద్ధపు ప్రచారాలను నమ్మి మోసపోయారని వివరించారు. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్‌కు రూ.లక్షతో పాటుగా తులం బంగారం ఎక్కడ ఉందని, ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు ఎక్కడ అని ప్రశ్నించారు. మూడు పంటలకు ఇస్తానన్న రైతుబంధు, 24 గంటల కరెంటు, రెండు లక్షల రుణమాఫీ ఇంతవరకూ అమలు చేయలేదన్నారు. ధాన్యానికి అదనంగా రూ.500 బోనస్ ఇచ్చి వడ్లు కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తామన్నారని, ఇంతవరకు లేదని విమర్శించారు.

స్థానికంగా ఉన్న నిజామాబాద్ ఎంపీ చేసింది శూన్యమని తెలిపారు. ఏ ఒక్క గ్రామానికి వెళ్లి చేసిందేమీ లేదని అన్నారు. సోషల్ మీడియాలో అబద్ధపు ప్రచారాలు చెప్పడం తప్ప ప్రజలకు చేసింది శూన్యమని విమర్శించారు. ఐదు రోజుల్లో తెస్తానన్న పసుపు బోర్డు ఐదు సంవత్సరాలు గడిచిపోయినా.. ఇంకా రాలేదని, సొంత డబ్బులతో షుగర్ ఫ్యాక్టరీ రీఓపెన్ చేయిస్తానన్నావ్ ఇంతవరకు దాని ఊసే లేదని మండిపడ్డారు. మళ్లీ ఏ ముఖం పెట్టుకొని ఓట్లు అడగడానికి వెళ్తున్నావని ప్రశ్నించారు. ప్రజలు వీటన్నింటిపై ఆ పార్టీ అభ్యర్థులు మీ గ్రామాలకు వచ్చినప్పుడు నిలదీయాలని ప్రజలకు సూచించారు. కాంగ్రెస్, బిజెపి పార్టీల నాయకుల మాటలు నమ్మి మరోసారి మోసపోవద్దని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో జడ్పిటిసి ఇందిరా లక్ష్మి నర్సయ్య, పార్టీ సీనియర్ నాయకులు శక్కరికొండ కృష్ణ, ఓడెం నర్సయ్య, పద్మారావు, నయీమ్, వివిధ గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచులు, ఉపసర్పంచులు, యువజన సంఘాల నాయకులు, గ్రామ శాఖ అధ్యక్షులు, బీఆర్ఎస్ పార్టీ అన్ని అనుబంధ సంఘాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

భర్తను హతమార్చిన భార్య

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని రెండు రోజుల కింద కులాస్పూర్ గ్రామంలో జరిగిన ఘటన మరువకముందే మళ్లీ న్యాల్కల్‌లో దారుణం చోటుచేసుకుంది. ఓ భార్య కట్టుకున్న భర్తను శుక్రవారం అర్ధరాత్రి హత్య చేసింది. సిఐ సురేష్‌కుమార్, ఎస్‌హెచ్‌ఓ గంగాధర్ తెలిపిన కథనం ప్రకారం.. భార్య భర్తలు లక్ష్మి, లక్ష్మణ్ (35) ఈ మధ్య వారికి తరచూ గొడవలు జరిగేవి. శుక్రవారం రాత్రి కూడా గొడవ జరగడంతో భార్య ఆగ్రహంతో భర్త తలపై బండరాయితో కొట్టి హతమార్చింది. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. లక్ష్మిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్ పార్టీ మత్స్య సహకార సంఘం అధ్యక్షుడిగా శ్రీనివాస్ నియామకం



నియామకపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని బోర్గం(పి) గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పి.శ్రీనివాస్‌ను కాంగ్రెస్ పార్టీ మత్స్య సహకార సంఘ అధ్యక్షుడిగా టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్‌గౌడ్, రూరల్ నియోజకవర్గం ఎమ్మెల్యే భూపతిరెడ్డి నియమించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ తన సేవలను గుర్తించి ఈ పదవిని ఇచ్చినందుకు రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డికి, మహేష్ కుమార్‌గౌడ్‌కు ధన్యవాదాలు తెలియజేశారు. అలాగే కాంగ్రెస్ పార్టీలో కష్టపడే కార్యకర్తలందరికీ న్యాయం జరుగుతుందని ఆయన తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపిస్తామని ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ మండలాధ్యక్షుడు భూమన్నెరవి, మాజీ ఎంపీపీ, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు యాదగిరి, ఎంపీటీసీలు రమేష్, రాములు తదితరులు పాల్గొన్నారు.

జెంటిల్ కిడ్స్ విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేత



అందుకున్న ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని యోగేశ్వర కాలనీ, మామిడిపల్లిలో అకాడమిక్ ఇయర్ విజయవంతంగా పూర్తి చేసుకొని జెంటిల్ కిడ్స్ విద్యార్థులు అద్భుతమైన ఫలితాలు సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ లయన్ గుజరాతి ప్రకాష్ శనివారం తెలిపారు. కేవలం చదువులో మాత్రమే కాకుండా రకరకాల కల్చరల్ యాక్టివిటీస్‌లోనూ డిసిప్లేన్, రెగులారిటీ, పంక్చుఆలిటీ అనే వివిధ రకాల కేటగిరీలలో, అదేవిధంగా క్లాస్ టాపర్లను ఈ సందర్భంగా ప్రశంసాపత్రాలు అందజేశారు. వీటితోపాటు ప్రథమ బహుమతిగా గోల్డ్ మెడల్, రెండవ బహుమతిగా సిల్వర్ మెడల్ అందించినట్లు విశ్వం ఎడుటెక్ అబాకస్ హైదరాబాద్ వారు నిర్వహిస్తున్న నేషనల్ లెవెల్ అబాకస్ పోటీలకు ఎంపికైన ఒకటవ తరగతి వర్షిత్ అనే విద్యార్థిని కూడా ప్రశంసిస్తూ ప్రశంసా పత్రాన్ని బహుకరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ లత, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థి బృందం పాల్గొన్నారు.

మే1 నుంచి బాలబాలికల వ్యక్తిత్వ వికాస శిబిరం

నవతెలంగాణ-బాల్కొండ

మండల పరిధిలోని కిసాన్‌నగర్ గ్రామంలో భగవాన్ శ్రీ సత్యానంద మహర్షి గీత భక్తజనాశ్రమంలో బాల, బాలికల వ్యక్తిత్వ వికాస శిబిరాన్ని మే1 నుంచి 7 వరకు నిర్వహించనున్నట్లు కార్యదర్శి జ్ఞానేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో 8 నుంచి 15 ఏళ్ల మధ్య వయస్సు పిల్లలకు భగవద్గీత, నిత్యప్రార్థన, శ్లోకాలు నేర్పిస్తున్నట్లు తెలిపారు. నైతిక విలువలు, కథలు, ఆటలు పుణ్యక్షేత్ర సందర్శన కార్యక్రమాలు ఉంటాయని సూచించారు. వారం రోజులపాటు ఆశ్రమంలోనే ఉండాల్సి ఉంటుందని పేర్కొన్నారు. 50 మందికి శిక్షణ ఇస్తామని.. వివరాల కోసం జ్ఞానేశ్వర్ 9394906086 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

బీజేపీ, బీఆర్ఎస్ హయాంలో ప్రజాస్వామ్య మనుగడకు ముప్పు

- పలువురు వక్తలు
- ప్రజాస్వామ్య పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం

నవతెలంగాణ-ఆర్మూర్

గత పదేండ్ల బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో ప్రజాస్వామ్యం మనుగడకు ముప్పు వాటిల్లిందని పలువురు వక్తలు పేర్కొన్నారు. మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో ప్రజాస్వామ్య పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 'ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికలు - ప్రజాస్వామ్యం -భవిష్యత్ కార్యాచరణ' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశాన్ని నియోజకవర్గ కన్వీనర్ ముగా ప్రభాకర్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పట్టణంలోని ఎస్సి, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ముస్లింలు, క్రిష్టియన్ కమ్యూనిటీలకు చెందిన ముఖ్య నాయకులు హాజరై బీజేపీ పార్టీ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టారు. భారత రాజ్యాంగాన్ని మారుస్తామని పదేపదే వ్యాఖ్యలు చేస్తున్న బిజెపి ప్రభుత్వానికి ఈ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో ప్రజాస్వామ్యవాదులను, అభ్యుదయవాదులను, అన్ని కుల సంఘాలను, విద్యార్థి సంఘాలను, వామపక్ష పార్టీల మద్దతును కూడగట్టి బిజెపి పార్టీని ప్రజాక్షేత్రంలో ఓడించడానికి కృషి చేస్తామని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజాస్వామ్య పరిరక్షణ సమితి పూర్తి మద్దతు కాంగ్రెస్ పార్టీకే ఉంటుందని తీర్మానం చేశారు. కార్యక్రమంలో ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు షెట్పల్లి నారాయణ, సీపీఐ(ఎం) డివిజన్ అధ్యక్షుడు పల్లపు వెంకటేష్, టౌన్ అధ్యక్షుడు కుతాడి ఎల్లయ్య, కుమ్మరి సంగం నేత లింబాద్రి, అంసా అధ్యక్షుడు అంగరి ప్రదీప్, జమతే ఇస్లామీ హింద్ అధ్యక్షుడు అస్లాం, అబ్దుల్లా, పాస్టర్ ప్రకాష్, సుధాకర్, మొచి సంఘం సాయిరాం తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న నాయకులు

ఇంటర్‌లో రాష్ట్రస్థాయి ర్యాంక్ సాధించిన మంగళ్‌పహాడ్ విద్యార్థిని



విద్యార్థిని సన్మానిస్తున్న పలువురు

నవతెలంగాణ-ఎడపల్లి

మండల కేంద్రంలోని శ్రీ వాగ్దేవి పాఠశాల కరస్పాండెంట్ నార్ల కాశీనాథ్ గుప్త ఆధ్వర్యంలో మంగళ్‌పహాడ్ గ్రామానికి చెందిన బెంగళూరు పోశెట్టి విజయలక్ష్మి దంపతుల కుమార్తె దెగ్లూరు రోషిని ఇంటర్ మొదటి ఎంపీసీలో 470 మార్కుల గాను 468 మార్కులు సాధించి రాష్ట్రస్థాయి ర్యాంకు పొందారు. ఈ సందర్భంగా శ్రీ వాగ్దేవి పాఠశాల కరస్పాండెంట్ నార్ల కాశీనాథ్ గుప్తా అలాగే ఉపాధ్యాయ బృందం ఆధ్వర్యంలో రోషినిని ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, రాష్ట్రస్థాయి ర్యాంకర్ రోషిని తల్లిదండ్రులు దెగ్లూర్ పోశెట్టి, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు 15 లోపు రైతు రుణమాఫీ చేస్తాం

- క్వింటాల్ వరి ధాన్యానికి అదనంగా రూ.500 బోనస్ ఇస్తాం
- రేషన్ కార్డు లేని వారికి రేషన్ కార్డు ఇప్పిస్తాం
- కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి జీవన్ రెడ్డి

నవతెలంగాణ-ఏర్గట్ల

ఆగస్టు 15 లోపు రైతు రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి జీవన్ రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని అమరవీరుల స్థూపం వద్ద నిజామాబాద్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ కార్నర్ మీటింగ్‌లో పాల్గొని ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ.. ఏర్గట్ల ప్రాంతంతో నాకు ప్రత్యేకమైన అనుబంధం ఉందని, 2006లో వైఎస్ హయాంలో నేను ఆర్.అండ్.బి మంత్రిని అయినప్పుడు తొలి సంతకం గుమ్మిర్యాల్ బ్రిడ్జి నిర్మాణం కోసమే పెట్టానని అన్నారు. ఉచిత కరెంట్ కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం అయ్యిందని, కాంగ్రెస్ పార్టీ రైతుల పక్షపాతి అని అన్నారు. ఆగస్టు 15 లోగా రైతులకు 2 లక్షల రుణమాఫీ, క్వింటాల్ వరికి మద్దతు ధరతో పాటు 500 రూపాయల బోనస్ ఇప్పిస్తామని అన్నారు. బీజేపీ పార్టీ రైతులకు అప్పులు మాఫీ చేయక పోగా, కేవలం పెట్టుబడిదారులకు మాత్రమే అప్పులు మాఫీ చేసిందని దుయ్యబట్టారు. రేషన్ కార్డు ఉండి 200 యూనిట్లలోపు విద్యుత్‌కు అర్హత పొందని లబ్దిదారులు కరెంట్ బిల్లు చెల్లించవలసిన అవసరం లేదని అన్నారు. అర్హత ఉన్న వారికి కచ్చితంగా రేషన్ కార్డు ఇప్పిస్తామని, దాని పూర్తి బాధ్యతను బాల్కొండ నియోజకవర్గ ఇంచార్జ్ సునీల్‌రెడ్డి తీసుకుంటాడని ప్రజలకు తెలిపారు. ఆరు గ్యారంటీలు కచ్చితంగా అందరికి అమలయ్యేలా చూస్తామని అన్నారు. కార్యక్రమంలో బాల్కొండ నియోజకవర్గ ఇంచార్జ్ ముత్యాల సునీల్ రెడ్డి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి, ఉపాధ్యక్షులు శివన్నోళ్ళ శివకుమార్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు సోమ దేవరెడ్డి, బాల్కొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆడేం గంగాప్రసాద్, రైతు నాయకులు అన్వేష్‌రెడ్డి, కిసాన్ ఖేత్ మండలాధ్యక్షులు ముస్కు మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి

బుద్దె రాజేశ్వర్ కుటుంబాన్ని పరామర్శించిన వేములవాడ ఆర్డిఓ

నవతెలంగాణ-బోధన్

రాజకీయ సీనియర్ నాయకులు బుద్దె రాజేశ్వర్ ఇటీవల గుండెపోటుతో మరణించిన విషయం తెలిసిందే. దాంతో వారి కుటుంబ సభ్యులను శనివారం వేములవాడ ఆర్డిఓ రాజేశ్వర్, బాన్సువాడ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పోచారం సురేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ మోహన్‌రెడ్డి బోధన్ ఎంపీపీ కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన మరణం తీరని లోటని వారు అన్నారు. ఆయన మృతి పట్ల వారు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి సానుభూతి తెలిపి ధైర్యాన్ని చెప్పారు. బుద్దె రాజేశ్వర్ ప్రజలకు అనేక సేవలను అందించారని గుర్తు చేశారు.

శ్రీనిధి రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో పాల్గొన్న పలువురు

నవతెలంగాణ-ఏర్గట్ల

శ్రీనిధి రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని మండల సమాఖ్య సమావేశాన్ని అధ్యక్షురాలు వసంత అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి ఏర్గట్ల ఎంపీడీఓ వెంకటేశ్వర్లు హాజరై మహిళలనుద్దేశించి మాట్లాడుతూ.. మహిళలు శ్రీనిధి రుణాలను తీసుకుని వాటిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం శ్యామ్, సీసీలు సంతోష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

బాజిరెడ్డి గోవర్ధన్‌ను ఎంపీగా గెలిపిద్దాం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరూ కలిసి కట్టుగా పనిచేయాలని, నిజామాబాద్ ఎంపీగా బాజిరెడ్డి గోవర్ధన్ విజయానికి కృషి చేయాలని ఎంపీపీ బాదవత్ రమేష్ నాయక్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు చిలువేరి గంగదాస్ అన్నారు. శనివారం ఇందల్‌వాయి మండలంలోని డోంకల్, గౌరరం, గుట్టకింది తండా, లింగాపూర్ గ్రామాలలో బూత్ కమిటీ సమావేశం నిర్వహించి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ శాసన సభా ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదని, మరోసారి ప్రజలకు మోసగించడానికి అమలు కాని హామీలను ఇస్తుందన్నారు. బిజెపి పార్టీ అభివృద్ధి చేయకుండా కులాల మతాల మధ్య చిచ్చుపెట్టి లబ్ధి పొందాలని చుస్తుందని అన్నారు. ప్రతి ఒక్క కార్యకర్తలు బుత్‌ల వారిగా అధిక మెజార్టీ వచ్చే విధంగా చూడాలని సూచించారు. ఈ సమావేశానికి వైస్ ఎంపీపీ బుసని అంజయ్య, గడ్కోల్ శ్రీనివాస్, తిర్మన్‌పల్లి ఎంపిటిసి చింతల దాస్, కుంట నర్సారెడ్డి, మోహన్ నాయక్, భాస్కర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కాంగ్రెస్ నాయకుల ఎన్నికల ప్రచారం

నవతెలంగాణ-బోధన్

పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా శనివారం పట్టణంలోని 11వ వార్డులో, పలు కాలనీలలో బోధన్ పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇంటింటికి తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎం.పీ అభ్యర్థి జీవన్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ ప్రచారంలో తూము శరత్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు పాషా మోహిన్ ఉద్దీన్, వర్కింగ్ ప్రెసిడెంట్ హరి కాంత్ చారి, రాష్ట్ర యూత్ ప్రధాన కార్యదర్శి దొడ్ల రవీందర్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి ప్రమోద్, పట్టణ ప్రధాన కార్యదర్శి విష్ణు వర్ధన్‌రెడ్డి, కౌన్సిలర్ ప్రభాకర్, కౌన్సిలర్ దాము, అబ్దులా, ఆదినారాయణ మయూరు, సంగ్రం తదితరులు పాల్గొన్నారు.